KSR02B1143

ప్రజాశక్తి
ఆదివారం అనుబంధం
అక్టోబర్ 30, 2016

స్నేహ

ఢిబ్బు.. ఢిబ్బు...

దీపావళి







బెంగాల్ టు బాలీవుడ్

సినిమా, థియేటర్ ఆర్ట్స్, మోడలింగ్ ఇలా నటనకి సంబంధించిన అన్ని రంగాల్లో తమ సత్తాచాటుకుంటున్నారు బెంగాలీ తారలు. ఈ హవా నాటి తరం తారలు షర్మిలా ఠాగూర్, తనూజ, మౌసామీ చటర్జీ, జయాబచన్ లెజెండరీ యాక్టర్స్ ద్వారా చాన్నాళ్ల క్రితమే బాలీవుడ్‌లో ప్రవేశించింది. వీరి నటనా వారసులుగా నేటి తారలూ ప్రేక్షకుల మదిలో సుస్థిరస్థానాన్ని దక్కించుకున్నారు. నటి తనూజ కూతురుగా కాజోల్ బాలీవుడ్‌లో అరంగేట్రం చేసినా డిడిఎల్‌జె, దుష్మన్, మై నేమీజ్ ఖాన్ వంటి బ్లాక్ బస్టర్ చిత్రాలు మంచి పేరుతో పాటు పద్మశ్రీ అవార్డుని తెచ్చిపెట్టాయి. ఎర్త్, ఫైర్ వంటి చిత్రాలతో వర్సెటైల్ యాక్టర్‌గా గుర్తింపు తెచ్చుకున్నారు నందితా దాస్. ప్రముఖ పెయింటర్ జతిన్ దాస్ కూతురుగా కంటే నటిగా, థియేటర్ ఆర్టిస్ట్‌గా, దర్శకురాలిగా, సామాజిక కార్యకర్తగా చాలామందికి తెలుసు. కాజల్ కజిన్, ప్రముఖ ప్లేబ్యాక్ సింగర్ క్రిష్ణ ముఖర్జీ, ఫిల్మ్ మేకర్ రామ్ ముఖర్జీల కుమార్తె, రాణీముఖర్జీకి కుచ్ కుచ్ హోతాహై సినిమాలో టీనా పాత్రకి అవకాశం లభించినా మార్దాని, నో వన్ కిల్డ్ జెస్సికా, హమ్ తుమ్, బ్లాక్ చిత్రాల్లో లేడీ ఓరియంటెడ్ పాత్రల ద్వారా సొంత ఇమేజ్‌ని సంపాదించుకుం. యాక్టర్, ఫిల్మ్‌మేకర్ అపర్ణాసేన్ కుమార్తె కొంకణా సేన్ నటించిన తొలి చిత్రం 'మిస్టర్ అండ్ మిసెస్ అయ్యర్'. నటిగా తనకి గుర్తింపునిచ్చిన చిత్రం 'వేకప్ సిడ్'. మిథున్ బండార్కర్ దర్శకత్వంలో వచ్చిన పేజ్-3, లైఫ్ ఇన్ ఎ మెట్రో చిత్రాల్లో అద్భుత నటనతో ఫిల్మ్‌ఫేర్ అవార్డుని సొంతం చేసుకుంది కొంకణ. మోడలింగ్ రంగం నుండి 'రాజ్', 'జిస్మ్' చిత్రాల ద్వారా బాలీవుడ్ అగ్రనటిగా మారింది బిపాషా బసు. ఫెమినా మిస్ ఇండియా, యూనివర్స్ టైటిల్ విజేత, ప్రముఖ మోడల్ తనుశ్రీ దత్తా 'చాక్లెట్', 'ఆషిక్‌బనాయా అప్‌నే' చిత్రాల ద్వారా నటిగా ప్రమోట్ అయింది. ప్రముఖ ఆర్థిక వేత్త అమర్త్యసేన్, నబనీత దేవ్ సేన్ కుమార్తె నందనాసేన్. బ్లాక్ చిత్రంలో ఒక చిన్న పాత్రలో బాలీవుడ్‌కి పరిచయమైన ఈ బెంగాలీ వారసురాలు ట్యాంగో చార్లీ, రంగ్ రసియా చిత్రాల్లో తన నటనతో ప్రేక్షకుల్ని కట్టిపడేసింది.

కాజల్

రాణీముఖర్జీ

కొంకణా సేన్

నందనా సేన్

ENTERED
KSR02-B143



బాల్యం ఓ అబ్బురం. అపురూపంగా పసి మొగ్గలకు అది బహుమతి అవ్వాలి. కానీ ఆ లేత హృదయాలకు గాయాలైతే.. జీవితాన్నే లాగేసుకునే పరిస్థితులు బాల్యంలోనే పరిచయమై.. ముంచేస్తే? వారి దిగులును తొలిచేసే మందు కావాలి. కుంగుబాటు నుంచి బయటకు లాగేసే మత్తు కావాలి. ఒకప్పుడు తననలా బయటకు లాగేసిన ఆ మత్తు మందు ఫొటోగ్రఫీ హాబీయే రాజన్‌కు. అదే మందు క్యాన్సర్ బారిన పడిన చిన్నారులకు, ఒంటరితనంతో నలిగిపోతున్న వీధి బాలలకు పనికి వస్తుందని రాజన్ నాయర్ కనిపెట్టాడు. ఆ హాబీని వారికి రాసేసి చిరునవ్వుల చినుకుల వర్షం కురిపిస్తున్నాడు. ఆ అపురూప చిత్రం చూడాలంటే రాజన్ గురించి చదవాల్సిందే.

అపురూప చిత్రం

ముంబయిలోని టాటా మెమోరియల్ ఆసుపత్రి పిల్లల విభాగం. అక్కడ ఉన్న పిల్లలందరూ క్యాన్సర్ వ్యాధితో బాధపడుతున్న వారే. వారంతా అక్కడ ఒక గుంపుగా కూర్చుని ఎదురుచూస్తున్నారు. ఫొటోల అంకుల్ రాజన్ అంత దూరంలో కనిపించాడు. అంతే అంతెత్తున ఆనందం రూమ్ దాటి బయటకి పరుగెత్తింది. ఈ ఫొటోల అంకుల్ తను తీసిన చిత్రాలను చూపించడానికే కాదు వారితో కూడా క్లిక్‌మనిపిస్తాడు. అందుకే తమకున్న ప్రాణాంతక వ్యాధిని కూడా మరచిపోయి సంబర పడతారు. ఫ్లాష్ వెలుగులకు తోడు వారి కళ్లల్లో, నవ్వుల్లో మరింత వెలుగు నిండిపోతుంది. జీవితంపై కొంగొత్త ఆశను రేకెత్తిస్తుంది. రాజన్ వర్క్‌షాప్‌లో అన్నీ కాంతులే. రాజన్ ముంబయికి చెందిన ఫ్రీలాన్స్ జర్నలిస్టు. పెద్ద పత్రికలకు పనిచేస్తుంటాడు. పెద్ద టాస్క్‌ల్లోనే పడిపోతుంటాడు. అయినా పిల్లల కోసం కాసింత వీలు కుదుర్చుకుంటాడు. తన రోజులో విలువైన కాలాన్ని జాగ్రత్తగా దాచుకుంటాడు. అలా ఇప్పటివరకు దాదాపు 700 వర్క్‌షాపులు నిర్వహించాడు.

తనకు మందులా..

ఇరవై ఏళ్ల క్రితం రాజన్ ఎడమ చెవికి వినికిడి శక్తి సన్నగిల్లింది. రక్తనాళాలు కుంచించుకు పోయాయని, శస్త్ర చికిత్స చేయాలని వైద్యుడు చెప్పాడు. కానీ, ఆ శస్త్ర చికిత్స విఫలమై రాజన్ ఎడమ చెవి వినికిడి శక్తిని పూర్తిగా కోల్పోయింది. ఆ తర్వాత ఏడాదికి అతని చెవిలో గుయ్...మంటూ పెద్ద మోత వినిపించేది. దీనిని తట్టుకోవడం చాలా కష్టం. ఈ వ్యాధి వల్ల ఆత్మనూన్యతలోకి నెట్టబడతారు. భరించలేక ఆత్మహత్య చేసుకోవాలని పదేపదే అనిపిస్తుంటుంది. ఈ బాధనే రాజన్ చాలాకాలం అనుభవించాడు. పనిలో పొరపాటు జరగడంతో ఉద్యోగానికి రాజీనామా చేశాడు. దీని గురించి ఆలోచిస్తూ ఉంటే మరింత బాధగా ఉండటంతో తనను పూర్తిగా మరిచిపోయే మత్తును ఆశ్రయించాలనుకున్నాడు. అది ఫొటోగ్రఫీ అని తెలుసుకున్నాడు. అంతే తనకున్న బాధనంతా ఎవరో ఒక్కసారిగా చేతిలో అట్లా తీసివేసినట్లనిపించింది. రచనా వ్యాసంగాన్నీ వృత్తిగా మలుచుకున్నాడు. జర్నలిజం, ఫొటోగ్రఫీలలో శిక్షణ తీసుకున్నాడు. జర్నలిస్ట్‌గా మారాడు. ఇది అతనికి ఒక అందమైన జీవన ప్రయాణంగా మారింది.

మరొకరికి...

అంగవైకల్యం కలవారికి, నయంకాని దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్న వారికి ఫొటోగ్రఫీ నేర్పించాలని ఆయనకు తోచింది. తొలిసారిగా 2000లో గుర్గావ్‌లోని ఓ చెవిటి పిల్లల స్కూలులో వారాంతపు రోజులలో ఉచితంగా ఫొటోగ్రఫీ నేర్పడం ప్రారంభించాడు. ఇలా మూడేళ్లు గడిచాక ఫొటోగ్రఫీ పరికరాలపై థియరీ క్లాసులు చెప్పేవాడు. ఆరు బయట ప్రదేశాలకు వెళ్లి ఫొటోలు తీయించేవాడు. వాటితో ప్రదర్శన (ఎగ్జిబిషన్) నిర్వహించేవాడు. అతితక్కువ కాలంలోనే రాజన్ కృషికి దేశ, విదేశాలలో ఖ్యాతి లభించింది. రాజన్ కృషిని గుర్తించిన ఆస్ట్రేలియాకు చెందిన ఒకరు తొమ్మిది కెమెరాలను బహుమతిగా ఇచ్చారు. వాటిని తను నిర్వహించే వర్క్‌షాపులలో ఉపయోగిస్తున్నాడు. రాజన్ వద్ద ఫొటోగ్రఫీ నేర్చుకున్న వారిలో ఐదుగురు ఇప్పుడు ఆ వృత్తిలో స్థిరపడ్డారు. ఇది రాజన్‌కు ఎంతో గర్వం కలిగిస్తున్న విషయం. 2013 నుంచి రాజన్ టాటా మెమోరియల్ ఆసుపత్రిలో తరగతులు నిర్వహిస్తున్నాడు. తొలుత కొన్ని రోజులు వర్క్‌షాపులు నడిపాడు. కానీ పేడియాట్రిక్ వార్డు వద్ద ప్రతి మంగళవారం కొన్ని గంటల పాటు పిల్లలు వైద్యుడిని కలిసేందుకు నిరీక్షించడాన్ని గమనించాడు. ఆ సమయంలో వారు ఎంతో భయానికి, ఇబ్బందికి, విసుగుకు లోనవుతుంటారని తెలుసుకున్నాడు. సాధారణంగా వైద్యుడంటేనే పిల్లలకు భయం. కానీ వీళ్లు క్యాన్సర్ బారిన పడినవారు. వీరికి మరింత బాధను మిగులుస్తుంది ఆస్పత్రి వాతావరణం. అందుకే ఆ సమయంలోనే ఫొటోగ్రఫీని ఉపయోగించాడు. నవ్వులు-కేరింతలతో పాటు ఏదో ఆసక్తి వారిని కట్టిపడేసింది. వైద్యుడి భయం, ఆస్పత్రి పరిసరాల స్పృహను దాటేసి వారేదో అమ్యూజ్‌మెంట్ పార్కులో ఉన్నట్టు ఫొటోగ్రఫీ సంతోషాన్ని తెచ్చింది. అంతే అప్పటి నుంచి ప్రతి మంగళవారం క్రమం తప్పకుండా కెమెరాలతో దిగిపోతాడు రాజన్. పలు స్వచ్ఛంద సంస్థల ఆహ్వానం మేరకు రాజన్ ఫొటోగ్రఫీ క్లాసులు నిర్వహిస్తున్నాడు. ప్రస్తుతం ఆర్థిక ఇబ్బందులతో సతమతమవుతున్నా కూడా వర్క్‌షాప్‌లను ఆపలేదు. పసినవ్వుల విషయంలో రాజీ లేదు. జీవితంలో చెడు దశలను అధిగమించడానికి సృజనాత్మకత ముఖ్యం అంటాడు రాజన్.

\- కె.ఎస్.ఎమ్

ౡ౹ౙ-ౘ౸౺ౚ

వినూత్నం........3

అనుభవాలే చిత్రాలు

స్టార్........4

అంతా సినిమాటిక్‌గా..!

నవ్వుల్ పువ్వుల్......... 5

వింత లోకం...........10

నాలుగేళ్లకు.. ఏడు భాషలు

కవిత్వమ్..................14

రణభేరి

విజేత.............. 15

రెండో పరుగు

ఇండెక్స్

దిబ్బు దిబ్బు దీపావళి



అట్టమీది కథ...6

నా కళ్లతో - 12

ఖర్జూర దేశం

కథ 16

జామీను పావురం

తెలుసా...................19

కళ్లు జాగ్రత్త

రుచి.....................21

కాజు కట్లీ

బాల నేస్తాలు............23

పేపరు మాస్క్

పద వికాసం.....

....24

'షో' లు నియంత్రించాలి

బీహార్ గ్రామాల్లో స్కూలు పిల్లలకు నాణ్యమైన విద్య అందించడానికి కృషి చేస్తున్న సాయి రథ్, సమాజంలో కులం, మతం అనే వేర్పాటు భావాల్ని తొలగించాలంటే అది యువతతోనే ప్రారంభం కావాలనే విషయాల్ని ప్రదర్శిస్తున్న అదితిరావ్‌ల ఉద్యమం అందరికి స్ఫూర్తిదాయకం. 'కొలవెరి డి' పాట గాయకుడు ధనుష్, నటుడిగా గీత రచయితగా కూడా రాణించడం అభినందనీయం. టి.విలో రొటీన్ సీరియల్స్‌తో పాటు, అనేక రకాల రియల్ షోలు, ప్రకటనలు ప్రేక్షకుల్ని ఉద్వేగ పరిచే కార్యక్రమాలు వాటి వలన జరుగుతున్న నష్టాన్ని స్పష్టంగా చర్చించింది కవర్ స్టోరీ.

- టి. సత్యనారాయణ మూర్తి, విశాఖపట్నం.

సమాజ మార్పుకో నాటకం

నేడు సమాజం ఎలా అభివృద్ధి చెందుతోందో కుల వ్యవస్థ కూడా అలాగే బలోపేతమవుతోంది. చాపకింద నీరుగా వ్యాపిస్తోంది. ఈ మహమ్మారి నిర్మూలనకు తసవ్వుర్ సంస్థ చేస్తున్న కృషి అభినందనీయం. నాటకాల ద్వారా ప్రజల్లో మార్పు తీసుకురావడానికి వారు చేస్తున్న పోరాటం స్ఫూర్తి దాయకం. ఆ సంస్థను నెలకొల్పిన విద్యావేత్త, కవయిత్రి అదితి రావ్ ఆదర్శనీయురాలు. మేఘాలయాలో



మాతృస్వామిక వ్యవస్థ విధానం బాగుంది. ఆఫ్రికా ఖండంలోని లాంగ్ టెయిల్ విడోబర్డ్ గురించి చక్కగా వివరించారు.

- వద్ది అంజనాదేవి, రాజానగరం

ఓ ఆలోచన మార్పు తెచ్చింది

16-10-2016 నాటి స్నేహ సంచికలో ....విభిన్నమైన విద్యా విధానాన్ని పాఠశాలలో ప్రవేశపెడుతున్న క్రియాశీలి సాయిరథ్ అభినందనీయులు. 'ఉద్వేగాల రేటింగ్స్ కవర్ స్టోరీతో శత శాతం ఏకీభవిస్తున్నాం. 'వింతలోకం' విశేషాలు చాలా బావున్నాయి. వివరం, సెంటర్ స్ప్రెడ్ పేజీ భారత్‌లో జురాసిక్ పార్క్ కొంగ్రొత్త అంశాల్ని స్పృశించింది. కవిత కదిలించింది. 'జాతి చెట్టుకు వేరుపురుగులు' కథాకర్తకు అభినందనలు. ఖాసీ తెగల జీవనశైలిని చూసి నవనాగరిక సమాజం ఎంతో నేర్చుకోవాలి. మనసూరిస్తూ, విస్మయంలోకి అడుగు దృశ్యమాలికలు కనువిందు చేసాయి. నవ్వుల్ పువ్వుల్ గిలిగింతలు పెట్టాయి.

-నేమాన సుభాష్ చంద్రబోస్, విశాఖపట్నం.

స్నేహ అక్టోబర్ 23 సంచికలో నవ్వుల్-పువ్వుల్ చాలా బాగున్నాయి. ఇదే విధంగా కొనసాగించాలని కోరుతున్నాను.

-ఎమ్ఎస్ వాస, విజయనగరం.

ఆకట్టుకున్న గృహప్రవేశం

ఆదివారం స్నేహ అనుబంధంలో 70 ఏళ్ల గృహప్రవేశం నన్ను మిక్కిలి ఆకర్షించినది. గతంలో సారథి సంస్థ చలన చిత్ర రంగంలో ప్రాముఖ్యతను పొందిన సంస్థ. వారు గతంలో సాంఘిక చిత్రాల నిర్మాణాన్ని ఒరవడి పెట్టి విప్లవాత్మకమైన సాంకేతికతలోనూ, దర్శకత్వం లోనూ నూతన పంథాను అమలు పరిచి మార్గదర్శకులైన సారథి సంస్థకు అతి దగ్గరి అనుబంధంతో వెలసిన సంస్థ. అందుకు సిఎస్ఆర్ గారి హాస్యరసంలో ప్రేక్షకులను ఓలలాడించిన చిత్ర రాజము ప్రసాద్ తదుపరి చిత్రం ద్రోహి. ఈ చిత్రాలతో ప్రసాదు గారి దర్శక ప్రతిభ అతని నటన తారాస్థాయికి చేరుకుంది.

- కై.ప నాగరాజు, అనంతపురం

సంచికపై మీ అభిప్రాయాలను పంపాల్సిన చిరునామా: స్నేహ, ప్రజాశక్తి, డోర్ నెం: 27-30-4, ఆకుల వారి వీధి, గవర్నర్ పేట, విజయవాడ.-520002.

మెయిల్ అడ్రస్: snehaweekly.praja@gmail.com

స్ఫూర్తి

అనుభవాలే చిత్రాలు

అనాదిగా ఆడపిల్లల్ని కట్టుబాట్లు ఆచారాల పేరుతో పితృస్వామిక వ్యవస్థ అణచివేతకు గురిచేస్తోంది. బాల్యం నుండి చివరి శ్వాసవరకూ ఆడపిల్లలు చేసే ప్రతి పనీ మగవాడితో శాసించబడుతోంది. అనాగరిక ధోరణుల కారణంగా గ్రామాల్లో ఆడపిల్లలు తమ ఉనికిని కోల్పోతున్నారు. ఇలాంటి మూస విధానాల నుండి స్త్రీలని బైటికి తీసుకు రావడం కోసం ఉమెన్ మేకింగ్ ఫిల్మ్ సంస్థ(డబ్ల్యుఎమ్ఎఫ్)ను ఏర్పాటు చేయడంతో పాటు వారి యదార్థగాథల ద్వారా సమాజంలో మార్పుతెచ్చేందుకు రచయిత్రిగా, ఫిల్మ్‌మేకర్‌గా కృషిచేస్తున్నారు వైష్ణవి సుందర్.

సమాజంలో అనాదిగా వేళ్లూనుకున్న పితృస్వామిక వ్యవస్థ కారణంగామహిళలు అణచివేయబడుతున్నారు. పట్టణాల్లో ఈ పరిస్థితులు అంతగా కనిపించకపోయినా ఇప్పటికీ గ్రామాల్లో అడపిల్లల్ని కట్టుబాట్ల పేరుతో కట్టడి చేస్తూనే ఉన్నారు. ఆడపిల్లలు ఎలాంటి బట్టలు ధరించాలి, ఎవరితో మాట్లాడాలి, ఎవరితో చనువుగా ఉండాలో కూడా కుటుంబంలోని మగవారి నిర్ణయంపైనే ఆధారపడి ఉంటుంది. భద్రత పేరుతో వేసే ఈ కంచెల నుండి బైటపడలేని మహిళలు చివరికి తమ ఉనికినే కోల్పోతున్నారు. చెన్నయ్‌లోని ఓ మారుమూల గ్రామం అవధిలో పుట్టి పెరిగిన వైష్ణవి చిన్న తనంలో అచ్చు ఇలాంటి పిరిస్థితులనే ఎదుర్కొన్నా అప్పుడు వాటిని ప్రశ్నించలేకపోయారు. చిన్నతనంలో తను ఎదుర్కొన్న తీవ్ర అనారోగ్య సమస్యల కంటే అనాగరిక ఆచారాలు తనని మరింతగా బాధించాయంటారు వైష్ణవి. శ్వాస సంబంధింత వ్యాధితో బాధపడుతున్న తనకి తల్లి అందించి సైకిల్ ప్రపంచమంటే ఏమిటో తెలిసేలా చేసింది. పగలంతా వైద్యం కోసం ఆసుపత్రి వద్దే గడపాల్సొచ్చేది. సాయంత్రం కొంత సేపు సైకిల్ తొక్కేందుకు తల్లి అనుమతించడంతో తనకు నచ్చిన ప్రదేశానికి సైకిల్‌పై వెళ్ళొచ్చే అవకాశం లభించింది. ఈ అవకాశమే తనకు స్వేచ్ఛ అనే పదానికి అర్థం తెలిసేలా చేసింది. ఉన్నత చదువు, ఉద్యోగ రీత్యా పట్టణంలో ఆడుగుపెట్టినప్పుడు ఇతరులతో చనువుగా మాట్లాడలేక పోవడంతో ఎన్నో సమస్యల్ని ఎదుర్కోవాల్సి వచ్చింది. ఇది తనొక్కతే కాదు గ్రామీణ ప్రాంతం నుండి వచ్చిన ప్రతి అమ్మాయి ఎందుర్కొంటున్న సమస్యేనని తెలిసిందామెకి. వీరిలో ఏ ఒక్కరూ తమ సమస్యలపై ఎదురు తిరగలేకపోవడం ఆశ్చర్యకరం. స్త్రీలు తమ సమస్యలపై నోరు విప్పనంత వరకూ ఇలాంటి అవమానాలని, అణచివేతలని మౌనంగా భరించాల్సి ఉంటుందనే సత్యం అవగతమవడంతో చెన్నయ్‌లోని ఒక కార్పొరేట్ సంస్థలో ఉన్నత ఉద్యోగాన్ని వదులుకుని తన సొంత రచనలు, సినిమాల ద్వారా మహిళా సమస్యల్ని ప్రపంచానికి తెలిపే ప్రయత్నాన్ని ప్రారంభించింది వైష్ణవి. తన చిత్రాలకు ఎంచుకున్న కథలన్నీ సమాజంలో మహిళల యదార్థ గాథలే. పురుషాధిక్యతను ప్రశ్నిస్తూ తను నిర్మించిన మొదటి చిత్రం పావా. కర్తార్ సింగ్ దుగ్గల్ రచన ద్వారా ఓ ట్యాక్సీ డ్రైవర్ జీవితాన్ని తెలుసుకున్న వైష్ణవి అదే కథాంశంతో 'ది క్యాటలిస్ట్ పేరుతో రెండో చిత్రాన్ని నిర్మించారు. ఒంటరిగా చిత్రాలని నిర్మించడమంటే అంత తేలికేంకాదు. స్త్రీలు, మైనారిటీల సమస్యలపై చిత్రాలు నిర్మించడ మంటే కత్తిమీద సాములాంటిదే. ఇలాంటి సున్నిత విషయాలని ప్రస్తావించినపుడు అప్రమత్తంగా ఉండాల్సి ఉంటుంది. ఇక ఈ కథాంశాలతో మహిళలు చిత్రాల్ని నిర్మిస్తే వీరికి బెదిరింపులతో పాటు కొన్ని సందర్భాల్లో స్పాన్సర్ల సాయం కూడా అందదు. యువ దర్శకులు ఇలాంటి పరిస్థితులు ఎదురైనప్పుడు ధైర్యాన్ని కోల్పోకూడదంటారు వైష్ణవి. బూర్జువా విధానాల వ్యతిరేకత, లింగ సమానత్వం, మత దురభిమానాన్ని అణచివేసే కథాంశాలతో ఆమె నిర్మించిన చిత్రాలన్నీ ప్రజల మనసుల్ని హత్తుకున్నాయి. వీటి ద్వారా మహిళా చైతన్యం కోసం పనిచేసేందుకు ముందుకొచ్చిన 85 మంది మహిళలతో ఏడాది క్రితం సుందర్స్ కమ్యూనిటీ ఫర్ ఫిల్మ్‌మేకర్స్ అనే ఆన్‌లైన్ కమ్యూనిటిని ఏర్పరిచారు వైష్ణవి. మహిళలు మాత్రమే చిత్ర నిర్మాతలుగా పనిచేస్తున్న ఈ కమ్యూనిటిని డబ్ల్యుఎమ్ఎఫ్(వుమెన్ మేకింగ్ ఫిల్మ్)గా పిలుస్తారు. ప్రపంచ వ్యాప్త గుర్తింపు కోసం తన బృందంతో కలిసి పనిచేస్తున్న వైష్ణవి ఈ సంవవత్సరం న్యూయార్క్‌లో జరిగిన ఫిల్మ్‌ఫెస్టివల్‌కి హోస్ట్‌గా నిర్వహించారు. డబ్ల్యు ఎమ్ఎఫ్‌ను ఒక ఎన్‌పిఎఫ్ సంస్థగా ఏర్పరిచేందుకు వివిధ స్కూళ్లు, కళాశాలలతో కలిసి పనిచేస్తున్న వైష్ణవికి ఇలాంటి కారణంతో పనిచేస్తున్న ఓ పాకిస్తాన్ సంస్థ సహాయం అందించేందుకు ముందుకొచ్చింది. ఇరుదేశాల మధ్య ఉన్న సరిహద్దు సమస్యల్ని రూపుమాపడంతోపాటు లింగ సమానత్వాన్ని పెంపొందించేందుకు చిత్ర మాధ్యమం ద్వారా కృషిచేస్తున్నారు వైష్ణవి సుందర్.



–శర్వాణి

అంతా సినిమాటిక్‌గా...!

బాగా చదివాడు. మంచి సాఫ్ట్‌వేర్ ఉద్యోగం కొట్టేశాడు. స్నేహితురాలే ప్రియురాలైంది. మధ్య తరగతి బ్యాక్‌గ్రౌండ్ నుంచి రావడం, మోస్తరు ఊరిలో పుట్టి పెరగడంతో అంతా సెట్టయి పోయిందని అనుకున్నాడు. తానే కాదు అందరూ అలానే అనుకున్నారు. అలా ఆగిపోయింటే నివిన్ పాలీని లక్షలాది మంది ఎలా ఆరాధించేవారు. కోట్లాది మంది ఎలా ఆదరించేవారు. చాలా సినిమాటిక్‌గా ఉంటుంది నివిన్ పాలి సినీ జీవితం. ఇప్పుడో పెద్ద స్టార్ అక్కడ. భాష అర్థం కాకున్నా అతడి సినిమాలో ఓ సన్నివేశం చూస్తే మనోడేరా అనిపిస్తుంది. మన తెలుగు కుర్ర హీరోల్లోని సహజ నటుల్లా నివిన్‌ది కూడా చక్కటి నటనా తీరు. అతడి కెరీర్ ప్రయాణమంతా సినిమాటిక్‌గా అనిపిస్తుంది. అతడి నటనేమో నిజంలా కనిపిస్తుంది.

- యర్నాకులంలోని అలువా ప్రాంతంలో 1984 అక్టోబర్ 11న పుట్టాడు నివిన్ పాలి.
- తండ్రి మెకానిక్‌గా స్విట్జర్లాండ్‌లో స్థిరపడడంతో తల్లి కూడా అక్కడే నర్స్‌గా పనిచేసేవారు.
- పాలి నివాసం, చదువు కొనసాగింది మాత్రం కేరళలోనే.
- కలమస్సెరి ప్రాంతంలోని రాజగిరి స్కూల్‌లో చదువుతూ ప్రతి సంవత్సరం వేసవి సెలవుల్లో తల్లిదండ్రులతో గడిపేవాడు పాలి.
- కొచ్చిలోని ఫెడరల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీలో ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్స్‌లో ఇంజినీరింగ్ పూర్తిచేశాడు.
- కాలేజీ రోజుల్లో 'ఓర్మకలిల్' మ్యూజిక్ వీడియో ద్వారా పాలికి నటుడిగా తొలిసారి అవకాశం లభించింది. క్యాంపస్ ఫ్రెండ్షిప్, ప్రేమ గురించి తెలిపిన ఓర్మకలిల్‌లో ప్రధాన పాత్రలో నటించాడు పాలి.
- శ్యామ్‌జిత్ డైరెక్షన్‌లో వచ్చిన ఈ మ్యూజిక్ వీడియోని ఎడిట్ చేసింది అల్‌ఫోన్స్ పుత్రెన్.
- దశాబ్దం క్రితం అల్‌ఫోన్స్‌తో ఏర్పడిన పరిచయం ప్రేమమ్ రూపంలో పాలికి పెద్ద హిట్ చిత్రాన్ని అందించింది.
- అల్లరి చిల్లరిగా తిరిగే కాలేజ్ స్టూడెంట్ పాత్రలో చాలా సినిమాల్లో కనిపించే పాలి నిజ జీవితంలో మాత్రం స్టూడెంట్ నెం1.
- ఇంజినీరింగ్ పూర్తిచేశాక ఇన్ఫోసిస్ బెంగుళూరులో సాఫ్ట్‌వేర్ ఉద్యోగిగా స్థిరపడినా తనకి ఆ రంగం సరిపడదనిపించింది. రెండేళ్ల తర్వాత ఉద్యోగానికి బై చెప్పి యాక్టింగ్ అవకాశాల కోసం ప్రయత్నాలు మొదలు పెట్టాడు.
- వినీత్ శ్రీనివాసన్ దర్శకత్వంలో వచ్చిన 'మాలార్‌వాడి ఆర్ట్స్ క్లబ్' చిత్రం ద్వారా పాలి సినిమాల్లో నటించే అవకాశం లభించింది.
- ఇది కూడా అనుకోకుండా దక్కిన అవకాశమే.
- మాలార్‌వాడి ఆర్ట్స్ క్లబ్ చిత్రంలో ప్రకాషన్ పాత్ర కోసం నిర్వహించిన ఆడిషన్స్‌కి వెళ్లాడు పాలి. కొన్ని రోజుల తర్వాత తన పేరుని రిజెక్టెడ్ లిస్ట్‌లో చూసుకోవాల్సి వచ్చింది. అయితే ఈ చిత్రం కోసం ఎంపిక చేసుకున్న వారిలో ఒకరు డ్రాపవడంతో 2010లో నివిన్ పాలికి మలార వాడి ఆర్ట్ క్లబ్‌లో నటించే ఛాన్స్ దక్కింది.
- తన ఇంజినీరింగ్ బ్యాచ్‌మెట్ రిన్నాని ప్రేమించిన నివిన్ పాలి 2010లో ఆమెని వివాహం చేసుకున్నాడు.
- జీవితంలో ఎదుర్కొన్న ఒడిదొడుకుల్లో ప్రతిసారీ రిన్నా వెన్నుతట్టి ప్రోత్సహించేవారట.
- షూటింగ్ సమయాలు తప్ప, తన పూర్తి సమయాన్ని కుటుంబంతో గడిపేందుకు ఇష్టపడుతుంటాడు నివిన్ పాల్ని
- మాలార్ వాడి ఆర్ట్స్ క్లబ్ తర్వాత రాజ్ పిళ్లయ్ దర్శకత్వంలో వచ్చిన 'ట్రాఫిక్'(2011), బిపిన్ ప్రభాకర్ దర్శకత్వం వహించిన 'మెట్రో'(2011), 'సీవెనెస్ (2011), 'స్పానిష్ మసాలా' (2011) సినిమాల్లో చిన్న చిన్న పాత్రలతో పాటు మరికొన్ని చిత్రాల్లో అతిథి, సహాయక పాత్రల్లో నటించినా 'తట్టతిన్ మరయతు' (2012) హీరోగా పాలికి బ్రేక్ ఇచ్చిన చిత్రం. మతాంతర ప్రేమికులు (హిందు అబ్బాయి, ముస్లిమ్ అమ్మాయి) ఎదుర్కొన్న సంఘర్షణ కథాంశంతో వచ్చిన ఈ కల్ట్ చిత్రం ఒక పెద్ద మ్యూజికల్ సెన్సేషన్.
- ఈ చిత్రం తర్వాత నివిన్ పాలికి వెనుదిరిగి చూడాల్సిన అవసరం రాలేదు.
- మళయాళ సెన్సేషనల్ హీరో నివిన్ కోసం డైరెక్టర్లు కూకట్టడం మొదలెట్టారు.
- సినిమాలతో పాటు మ్యూజిక్ వీడియోల్లో అవకాశాలు తలుపుతట్టాయి.
- 'యువ' మ్యూజిక్ వీడియోలో నజీరియా నజీమ్‌తో కలసి నటించాడు పాలి. ఈ ఆల్బమ్‌లోని నెన్‌జోడు చేతు. అత్యధిక ప్రేక్షకులు వీక్షించిన రికార్డున్న ఈ పాట వివాదాస్పదం కావడంతో పాలికి కొన్ని విమర్శలు ఎదుర్కోవాల్సి వచ్చింది.
- తర్వాత తను నటించిన నేరం(2013), 5 సుందరికాల్(2013), 1983(2014), ఓమ్ శాంతి ఓషాన(2014), బెంగళూర్ డేస్(2014), ఓరు వడక్కన్ సెల్ఫీ (2015) అన్నీ మాలీవుడ్ హిట్ చిత్రాలే.
- తను నటించిన చిత్రాల్లో బెంగళూర్ డేస్ చిత్రానికి కేరళ ప్రభుత్వం నుండి ఉత్తమ నటుడిగా అవార్డు అందుకున్నాడు నివిన్ పాల్. 1983 చిత్రానికి ఫిల్మ్‌ఫేర్ అవార్డుతో పాటు ఉత్తమ నటుడిగా ఫిల్మ్‌ఫేర్ అవార్డుని అందుకున్నాడు. ఈ చిత్రం కోసం నివిన్ ఒక పాటని పాడినా సాంకేతిక కారణాల వల్ల అది విడుదల కాలేదు.
- సై.మా (ఎస్ఐఐఎమ్ఎ) అవార్డ్, సౌత్ ఇండియన్ రైజింగ్ స్టార్ ఆఫ్ ఇండియన్ సినిమా ఇలా ఎన్నో అవార్డులు, రివార్డ్‌లని సొంతంచేసుకున్నాడు పాలి.
- 2015లో నివిన్ పాలి నటించిన 'ఇవిడె', 'ప్రేమమ్' రెండు చిత్రాలు ఒకే రోజు విడుదలయ్యాయి.
- వీటిలో 'ఇవిడె' ప్రేక్షకులని ఆకట్టుకోలేక పోయింది.
- బ్లాక్ బస్టర్ చిత్రంగా ప్రేమమ్ పాలిని యూత్ ఐకాన్‌గా మార్చింది.
- చిత్ర సీమలో వరుస విజయాల్ని దక్కించుకున్న నివిన్ మమ్ముట్టికి పెద్ద ఫ్యాన్. ✦

నవ్వుల్ - పువ్వుల్

కరెంట్



రాము: అరేయ్... నీళ్లలోంచి కరెంటు ఎందుకు తీస్తారా?

వెంగళప్ప: అది కూడా తెల్దేంటి, మనం స్నానం చేసేటప్పుడు కరెంట్ షాక్ కొడుతుందని.

రెండుసార్లు

కొడుకు: అమ్మోయ్ ఇవాళ నాన్న 'సుప్రభాతం' రెండు సార్లు చదువుతున్నాడేంటి?

తల్లి: నాకు పనుందని నా వంతు కూడా చదవమన్నా లేరా!

ఏదైనా పండిస్తా

విలేఖరి: మీరు డైలాగులు భలేగా పండిస్తున్నారే. గతంలో ఏం చేసేవారు?

రచయిత: పండ్లతోటల సాగు చేసే వాణ్ణి!

ఎప్పుడూ ఫస్టే

ఎస్సై: ఏమయ్యా హెడ్డా స్కూల్లో రన్నింగ్ రేస్‌లో ఎప్పుడూ సెకండ్ వచ్చేవాడివని చెబుతుంటావు. మరి దొంగని పట్టుకోలేక పోయావేం?

కానిస్టేబుల్: వాడు నా క్లాస్‌మేట్ సార్ రన్నింగ్‌లో ఎప్పుడూ ఫస్ట్ వచ్చేది వీడికే......

పిల్లలాట

శ్రీను: మా అమ్మాయి ఈ మధ్య మరీ చిన్న పిల్లలా బిహేవ్ చేస్తోంది డాక్టర్?

డాక్టర్: ఏం చేసింది?

శ్రీను: నేను గోళీలాట ఆడుతుంటే వాటిని లాక్కుంది.

భాష

సురేష్: ఈ మధ్య మీరు ఉర్దూ పేపర్ వేయించుకుంటున్నారేమిటి?

కోదండం: పక్కింటాయనకి ఇంకా ఆ భాష రాలేదు. (కోపంగా)

అప్పు

పంకజం: వదినా కాస్త పంచదార అప్పిస్తావా?

సుశీల: లేదు వదినా

పంకజం: పోనీ బెల్లం...

సుశీల: అదీ లేదు

పంకజం: మరి ఏమున్నాయ్ ఏంటి?

సుశీల: ఉప్పు, కారం!

కిసుక్కు

తల్లి: మళ్లీ ఏ వెధవన్నర వెధవతో తన్నులు తిన్నావురా? తలకి అంత పెద్ద దెబ్బ తగిలింది?

చింటు: డాడీనే మమ్మీ.... 'కొట్టింది'.

రాయితీ

అప్పారావు ఒక షాపు దగ్గరికెళ్లి ఓనరుతో..... కిలో నూనె ఎంతండీ అని అనిగాడు.

షాపుఓనరు: ఎనభై రూపాయలు.

అప్పారావు: ఒకేసారి పది కిలోలు తీసుకుంటే ఏమైనా తగ్గుతుందా?

షాపుఓనరు: ఆ... తప్పకుండా తగ్గుతుంది, అరకిలో.....

రక్తదానం

భార్య: ఈ మధ్య మరీ రాక్షసంగా ప్రవర్తిస్తున్నారు.... బుద్ధిలేకుండా

భర్త: మొన్న నాకు యాక్సిడెంట్ అయినప్పుడు నీ రక్తాన్నే కదా నాకు ఎక్కించింది.



అట్టమీది కథ

దిబ్బు దిబ్బు దీపావళి

దీపం ఒక్కటి వెలిగిస్తేనే బోలెడు వెలుగు. అలాంటి దీపాలు ఒకటి తరువాత ఒకటిగా కొలువైతే... ఇల్లంతా వెలుగు. వీధంతా వెలుగు. ఇలా ప్రతి ఇల్లూ దివ్వెల తోరణమైతే.. ఊరంతా వెలుగు. ఊళ్లన్నీ వెలుగు పువ్వులైతే... దేశానికి మహా వెలుగు. దీపావళి అలాంటి వెలుగుల పర్వ దినం. దేశం నలుమూలలా కాంతి పుంజాలు వెల్లి విరిసే దివ్వెల వనం. దీపావళికి, జనావళి జీవితానికి విడదీయరాని సంబంధం ఉంది. చిమ్మ చీకటి అమావాస్య రోజున పండు వెన్నెల కురిసే నిండు జాబిలి దీపావళి. మరి ఆ దీపావళి ప్రజాహితంగా, పర్యావరణ హితంగా ఉందా? విపరీత కాలుష్యమూ, మితిమీరిన కాల్పుల ఖర్చేనా దీపావళి పరమార్థం? ఒకప్పుడు పల్లెల్లో పిల్లల పాటలైన 'దివ్వి దివ్వి దీపావళి.. దిబ్బు దిబ్బు దీపావళి..' అసలు గుర్తున్నాయా? అచ్చ తెలుగింటి పండగ కాంతులు ఇంకా మిగిలే ఉన్నాయా? వెలుగుల వేడుక ముచ్చట్లే ఈ వారం అట్టమీది కథ.

- సత్యాజీ
9490099167

ఏ పండక్కి అయినా ఓ లక్షణం ఉంటుంది. తలపు మనసు తలుపును తట్టగానే - అది బాల్యంలోకి తెరచుకుంటుంది. దీపావళి కూడా అంతే! ప్రధానంగా ఇది పిల్లల ఆనందాల పండగ. అందుకనే గుర్తు రాగానే మనసు నిండా జ్ఞాపకాల చిచ్చుబుడ్లు విరజిమ్ముతాయి. ముఖం నిండా సంతోషాల మతాబులు వెలిగిపోతాయి. జ్ఞాపకాలు భూచక్రాల్లా గిర్రుగిర్రున తిరుగుతాయి. ఇలా వెనక్కి వెనక్కి వెళితే- ఈ పండగ ప్రకృతితో ముడిపడి సాగిన రోజులు కళ్లముందు సాక్షాత్కరిస్తాయి.

పచ్చని వాతావరణంలో వెచ్చని పర్వదినం!

ఇప్పుడు దీపావళి అంటే శబ్దాల హోరు ... పోటాపోటీగా కాల్పుల మోత! ఒకే ఒక్క రాత్రిలో దేశం మొత్తం వేల కోట్లను మందుగుండు సామగ్రిగా కాల్చేసే పర్యావరణ వినాశని. ధ్వని, వాయు కాలుష్యాలను సృష్టించే ధనాధన్ పండగ. ఏ పండగలోనైనా వ్యాపారమూ, ఆధిక్య ప్రదర్శనా ప్రవేశిస్తే- ఇంతే! అసలు పండగ పక్కకు పోయి- హడావిడి దండగ పడగవిప్పుతుంది. దీపావళి రోజున ఇప్పుడు చాలాచోట్ల జరుగుతున్నది ఇదే! పండగ ఏదైనా- దాని స్వభావం సమిష్టితత్వం. మనుషులు కలవడం ద్వారా వ్యక్తమయ్యే సంతోషాల పంపకం.

ఓ పాతికేళ్ల క్రితం వరకు దీపావళిలో ఇప్పుడున్నంత శబ్ద కాలుష్యం లేదు. ప్రకృతితో ముడిపడిన పద్ధతిలో పండగ జరిగేది. ముమ్మరంగా సాగిన వ్యవసాయ పనిపాట్లు అప్పటికి నెమ్మదిస్తాయి. పచ్చదనం నిండిన వాతావరణం భలే కనువిందుగా ఉంటుంది. మెట్ట పంటలు కొన్ని ఫలసాయంగా ఇంటికొస్తాయి. వరి, చెరకు వంటివి పొలాల్లో యవ్వనాలీనుతూ ఉంటాయి. అప్పుడప్పుడే చలి రెక్కలు తొడుక్కుంటూ ఉంటుంది. అప్పుడొస్తుంది ఈ దివ్వెల పండగ.

సందడి అంతా పిల్లలదే!

దీపావళి వస్తుందంటే- పిల్లలకు వారం, పది రోజుల నుంచి సందడే సందడి. ఊరిలో పండగ వాతావరణం పొటమరిస్తూ ఉండేది. కుమ్మరి సత్తెయ్య వాకిట్లోనూ, అరుగు మీదా ఎండబెట్టిన చిచ్చుబుడ్లు పిల్లలను చూసి నవ్వుతున్నట్టే ఉండేవి. సుబ్బయ్య కిరాణా కొట్టులో పొటాషియం, గంధకం పొట్లాలు అమ్మకానికి సిద్ధంగా ఉండేవి. నార తీయగా

మిగిలిన గోగుకర్రలు రైతుల కళ్లాల్లో గుట్టగుట్టలుగా పడి ఉండేవి. ఏపుగా ఎదిగిన ఆముదపు చెట్లు దీపాల వత్తుల కోసం మోర చాచినట్టు కనిపించేవి. పెరట్ల నిండా బంతి పూలు, చామంతులు, కనకాంబరాలు, గోగు పూలు, మందారాలూ కళకళ్లాడుతూ ఉండేవి. పేడ నీళ్లు చల్లిన మట్టి వాకిళ్లు పిండి ముగ్గులతో కనువిందు చేసేవి.

సేకరించిన సామగ్రితో బాణాసంచా తయారు చేసుకోవడం పిల్లలకు ఒక సరదా. మావయ్యో, బాబాయో సలహాలు ఇస్తుండగా- పొటాషియం, గంధకం కలిపి నూరడం, చిచ్చుబుడ్లు, వెన్నముద్దలు, సిసింద్రీలూ తయారు చేయడం- ఒక సందడి. అలా తయారైన వాటిని రెండు మూడు రోజుల పాటు జాగ్రత్తగా ఎండబెట్టడం ఒక బాధ్యత. ఈ కష్టంలోని పనితనానికి దీపావళి రోజున అవి ఎంత బాగా కాలాయి అన్నదే కొలబద్ద. ఏ పండక్కి అయినా ఎప్పుడు తెల్లారుద్దా? అని అనిపిస్తే- దీపావళికి మాత్రం ఎంత తొందరగా చీకటి పడుతుందా? అని మనసు ఉవ్విళ్లూరుతూ ఉంటుంది. దీపాల నివేదన పూర్తయిన తరువాత మతాబుల సందడి మొదలవుతుంది.

ఇలా అంటిస్తే చాలు, అలా చెలరేగి పోయే సిసింద్రీలు, పిల్లల నవ్వుల్లా ఎగసిపడే చిచ్చు బుడ్డి వెలుగు రవ్వలూ, ముద్దు ముద్దుగా ముద్ద ముద్దలుగా వెలుగులీనే వెన్నముద్దలూ ... ఆల్ ఆర్ హోమ్ మేడ్ ! తయారీలో ఇంట్లోని పిల్లలందరి పాత్రా ఉండేది. తయారైన సామగ్రి పరిమితమే! అయినా, ప్రతి ఒక్కటీ ప్రత్యేకంగా అనిపించేది! చిన్ని రివ్వకు గుచ్చిన నేపాలీ గింజల దండ చాలాసేపు చక్కగా వెలిగేది. రమణ చుట్టిన సిసింద్రీ తుస్‌మందా? లెస్సగుందా? అన్నయ్య కూరిన చిచ్చుబుడ్డి ఎగసి మురిపించిందా? ముఖం మాడ్చేసిందా? బావ కాల్చిన టపాకాయ ధన్‌మని పేలిందా? తుస్‌మని చీదేసిందా? చిన్ని సిసీంద్రీలు ఎవరినెలా హడలెత్తించాయి? పండగ వేళ ఇవన్నీ సరదా సరదా కబుర్లే! దీపావళి అయిపోయాక కూడా ముఖాల్లో వెలుగులు విరజిమ్ముతూనే ఉంటాయి.

దుబ్బు దుబ్బు అమాస..

అసలు పండగ రోజున బాణాసంచాకు ముందు సాగే సందడి దిబ్బు దిబ్బూ దీపావళి. అది పర్యావరణానికి ఏమాత్రం హాని చేయని సందడి. నార తీసిన గోగుకర్రలను కట్టలుగా కడితే బొద్దు కట్టెలు తయారవుతాయి. చీకటి పడిన వేళ వాటిని వాకిట్లో పెట్టి- అగ్గి ముట్టిస్తే వెలుగునిస్తాయి. దానిముందే ఆముదపు మొక్కలు లేదా గోగు మొక్కల పలవులకు (కొమ్మలకు) తెల్లని నూలు గుడ్డలు వత్తులుగా కడతారు. వాటిని ఆముదం లేదా నువ్వుల నూనెలో ముంచి వెలిగిస్తారు.





కుటుంబ సభ్యులు అందరూ వరుసగా నించొని, ఒక్కొక్కరు ఒక్కో దీపాల కర్రను పట్టుకొని గుండ్రంగా తిప్పుతారు. అది కనువిందు చేసే ఓ కమ్మని సన్నివేశం. అలా తిప్పుతూ- 'దిబ్బు దిబ్బు దీపావళి.. మళ్లీ వచ్చే నాగుల చవితి' అని పాడతారు. 'దుబ్బు దుబ్బు ఆమాస .. ఐదో రోజు తోపుండ ..' అని నాగుల చవితిని కూడా గుర్తు చేస్తారు. 'దివ్వీ దివ్వీ దీపావళి' అనే పాట- బాణాసంచా హడావిడి ప్రవేశించిన తరువాత - దుబ్బు దుబ్బూ దీపావళిగా మారింది అంటారు. మొదటి దానిలో దీపానికి (దివ్వి, దివ్వె) ప్రాధాన్యతనిస్తే- మారిన పాటలో శబ్దానికి (దుబ్బూ దుబ్బూ) ప్రాధాన్యం కనిపిస్తుంది. దీపాల తంతు ముగిసిన తరువాత కుటుంబ సభ్యులు అందరూ కలిసి భోజనం చేస్తారు.

అన్ని ప్రాంతాల్లో దీపాల పండగ

కథలూ కారణాలూ ఏమి చెప్పినా- మన దేశంలోని అన్ని ప్రాంతాల్లో దీపావళిని జరుపుకుంటారు. దీపావళి జరుపుకోవటానికి మూడు, నాలుగు కథలు ప్రచారంలో ఉన్నాయి. నరకాసుర వధ, బలి చక్రవర్తి రాజ్యదానం, రాముడు అయోధ్యకు తిరిగొచ్చి భరతుడిని కలవడం (భరత్ మిలాత్), విక్రమార్కుడి పట్టాభిషేకం ... ఇలా ఒక్కో ప్రాంతంలో ఒక్కో కథను కారణంగా చెప్పుకుంటారు. ఈ నాలుగింటిలో నరకాసుర వధ కథే ఎక్కువ ప్రాచుర్యంలో ఉంది. నరకుడు ప్రజలను పీడిస్తూ ఉంటే శ్రీకృష్ణుడు అతడిని చంపటానికి వెళ్లాడు. యుద్ధంలో కృష్ణుడు మూర్ఛపోతే- అతడి వెనక ఉన్న సత్యభామ శరసంధానం చేసి, నరకుణ్ణి హతమార్చింది అట! నరకుడి బాధ తొలగిపోవడంతో- ఆ మరుసటిరోజు ప్రజలంతా ఆనందోత్సాహాలతో పండగ చేసుకున్నారట. ఇదీ, కథ. అందుకనే ఆశ్వయుజ మాస బహుళ చతుర్దశిని నరక చతుర్దశిగా పిలుస్తారు. తరువాతి రోజును దీపావళి అమావాస్యగా జరుపుకుంటారు. ఉత్తరాదిలో దీనినే ధనతేరస్‌గా జరుపుకుంటారు. మార్వాడీలకు ఇది ప్రత్యేక పర్వదినం. వారి వ్యాపార లావాదేవీలకు ఇదే ఆరంభ దినం.

మళ్లీ వచ్చే
నాగుల చవితి

దీపావళి వెళ్లిన ఐదో రోజే నాగుల చవితి. అది పూర్తిగా వ్యవసాయ సంబంధ వేడుక. కుటుంబ సభ్యులు మొత్తం పుట్ట వద్దకు వెళ్లి, పూజలు చేయడం ఆనవాయితీ! చలిమిడి, చిమ్మిడి చవితి ప్రత్యేక ప్రసాదాలు. నువ్వులూ బెల్లం కలిపి దంచి తయారు చేసే చిమ్మిడి మహా గొప్ప సువాసనతో మనసు

లాగేస్తూ ఉంటుంది. అలాంటప్పుడు ఉపవాసంతో ఉన్న పిల్లలు తమాయించుకోవడం కష్టమే! 'తలపేమో చవితి.. చూపేమో చిమ్మడి..' అన్న సామెత ఇలాంటి కష్టకాలంలోనే పుట్టుకొచ్చింది మరి! బియ్యపు పిండి బెల్లం కలిపి చేసే చలిమిడికి ఆ సమయంలో అంత గిరాకీ ఉండదు. 'పుట్టలో వేయకుండా పొట్టలో ఎలా వేస్తావురా?' అని ఇష్టంగా మందలించే అమ్మమ్మలు - తొలి ప్రసాదాన్ని ఆవురావురమనే మనవళ్లకే అందిస్తారు. అదొక ముచ్చట. చిమ్మిడి అంటే- చలికి కూడా ఇష్టమట! 'చిమ్మిడి పెడతానని చెప్పి, చలిని చవితి తీసుకొచ్చింది.. కొత్తామావాస్య (ఉగాదికి ముందు రోజు) ఏమో, కొట్టి తగిలేసింది.' అం టుంటారు గ్రామాల్లో.

చెట్లుచేమలూ, పొదలూ పొదులూ విస్తారంగా పెరిగి ఉండే కాలం ఇది. క్రిమికీటకాలూ, పాములూ పురుగులూ కూడా ఎక్కువగా వృద్ధి చెంది ఉంటాయి. చేలూ చెట్లలో తిరిగేటప్పుడు పాముల నుంచి ప్రమాదం లేకుండా ఉండడం కోసం జనం ప్రకృతికి ప్రణమిల్లే పర్వదినం ఇది. దీనిలో ఇతరత్రా ఏ పురాణ కథలూ వినిపించవు. రైతు కుటుంబాల్లో అనాది నుంచి నాగుల చవితి ఉందని, దీపావళి మాత్రం మధ్యలో వచ్చి చేరిందని చెప్పే వాదన ఉంది. నాగుల చవితి ద్రవిడ సంబంధ సంస్కృతి అని, దీపావళి ఆర్యుల ద్వారా ప్రవేశించిన పండగ అని అంటారు.

ఇప్పుడైనా, ఇంతకు ముందైనా చెల్లుబాటు, జరుగుబాటు ఉన్న వారి సంస్కృతీ, సాంప్రదాయాలు విస్తృత ప్రచారం పొందుతాయి. అవి నెమ్మదిగా అందరిలోనూ ప్రవేశించి, అందరి చేతా ఆచరించబడతాయి. ఏళ్ల తరబడిన ఆచరణలో అవి కలగాపులగం అయిపోతాయి. మనదేశంలో ఎక్కడికక్కడ భిన్న సంస్కృతులు, భిన్న సాంప్రదాయాలూ ఉన్నాయి. విశ్వాసాలు కూడా భిన్నంగానే ఉంటాయి. నరకుడు, రావణుడు, బలి చక్రవర్తి వంటి వారు ఒకరి కథలో విలన్లు అయితే- మరొకరి కథలో హీరోలు. ఆయా కాలాల్లోని చారిత్రక వాస్తవాల ఆధారంగా భౌగోళికంగా ఏర్పడి, స్థిరపడిన భావనలు అవి. ఇలాంటి విశ్వాస వ్యత్యాసాలు ఉత్తర, దక్షిణ భారతదేశాల మధ్య చాలా స్పష్టంగా కనిపిస్తాయి. కాబట్టి- ఈ భిన్నత్వాన్ని, నమ్మకాలను గౌరవించటమే ఏ పండగకు అయినా పరమార్థం. అన్నిటినీ ఒకే గాటన కట్టి- ఒకే కథ, ఒకే సంస్కృతి అని చెబితే- తప్పవుతుంది.

అతకని భాష్యాలు

కొందరు ఈ సాంప్రదాయాలకు ఆరంభంలో లేని మహత్తులను ఆపాదిస్తుంటారు. ఏ పండగ అయినా ఒకప్పుడు ఒక సామూహిక సంతోషం. ప్రకృతికి భంగం కలిగించని పద్ధతిలో, ప్రకృతిలో మమేకమై పరవశించే సందర్భం. ప్రారంభంలో వాటి పరమార్థం అదే! వాటి ప్రయోజనం అంత వరకే! ఇప్పుడు కొత్త అర్థాలు చెప్పేవారు తయారయ్యారు. ప్రతి సాంప్రదాయం వెనకా గొప్ప సైన్సు ఉందని చెబుతూ ఉంటారు. 'ఈ కాలంలో దోమలు, ఇతర క్రిమికీటకాలూ ఎక్కువగా ఉంటాయి. మందుగుండు కాల్చటం వల్ల వచ్చే పొగకూ, వాసనకూ అవి చనిపోతాయి లేదా దూరంగా పోతాయి' అని వివరణ ఇవ్వడం కుహనా సైన్సు తప్ప మరొకటి కాదు.

అలాంటి భాష్యాలు అర్థం లేనివి. దోమలను, ఈగలను నిర్మూలించటానికి అనేక సులభ పద్ధతులు ఉండగా- ఇంత శబ్ద, వాయు కాలుష్యం, ఖర్చు అవసరమా అన్నది పర్యావరణవేత్తల ప్రశ్న. పైగా ఈ పండగల ప్రారంభంలో ఇప్పుడున్న హడావిడీ, హంగామా లేవు.

చిత్రావళి

సినిమాల్లో దీపావళిపై వచ్చిన చాలా పాటలు బాగా ప్రాచుర్యం పొందాయి. దీపావళికి మనం తప్పనిసరిగా వినే పాట : 'చీకటి వెలుగుల రంగేళి జీవితమే ఒక దీపావళి...'. ఇది 1972లో వచ్చిన 'విచిత్ర బంధం' చిత్రంలోది. 'షావుకారు' సినిమాలో 'దీపావళి దీపావళి/ ఇంటింట ఆనంద దీపావళి/ మా ఇంట మాణిక్యావళి' అని సంతోష సమయంలో వచ్చిన పాట- సెకండాఫ్‌లో గొడవలు వచ్చి విడిపోయినప్పుడు- 'దీపావళి, మా ఇంట శోకాంధ తిమిరావళి' అని వినిపిస్తారు. దర్శకుడు ఆనందానికి, బాధకు సింబాలిక్‌గా దీపావళిని ఉపయోగించారు. 'పెళ్లికానుక' సినిమాలోనూ ఇలాగే ఉంటుంది. మొదట 'దీపావళి' పండగ చేసుకుంటూ హీరో హీరోయిన్లు ఆనందంగా 'ఆడే పాడే పసివాడా ఆడేనోయి నీ తోడ/ ఆనందం పొంగేనోయి దీపావళి/ ఇంటింట వెలుగు, దీపాల మెరుగు, ఎనలేని వేడుకరా' అని పాడుకుంటారు. ఆ సంతోషం కాస్త దుఃఖమైనప్పుడు- 'ఆడే పాడే పసివాడ/ అమ్మా లేని నినుచూడ కన్నీటి కథ ఆయె దీపావళి, ఊరెల్ల వెలుగు/ ఆనందం కనరాని దూరమురా' అంటూ రిపీట్ చేస్తారు. 'భలే రాముడు' సినిమా ఆఖర్లో సావిత్రి 'ఇంటింటను దీపావళి మా ఇంటను లేదా/ ఆ భాగ్యము రాదా' అని పాడుతుంది. 'ఋణానుబంధం' సినిమాలో 'వచ్చింది దీపాల పండుగ/ ఉన్నోళ్ళ దబ్బంతా దండుగ' పాట కొత్త కోణంలో వినిపిస్తుంది. దాసరి నారాయణరావు 'మామగారు' చిత్రంలో 'వెయ్యేళ్ల నిత్యమైన దీపావళి/ ఏనాడూ వెళ్లిపోని దీపావళి/ ఏరికోరి ఎంచుకుంది మా లోగిలి' పాట బాగా పాపులర్ అయింది. 'విజయదశమి' చిత్రంలోనూ దీపావళిపై పాట ఉంటుంది.

'దీపావళి' టైటిల్‌తో తెలుగులో ఇప్పటికి రెండు సినిమాలు వచ్చాయి. మొదటిది 1960లో వచ్చిన పౌరాణిక చిత్రం. రెండోది 2008లో వేణు హీరోగా నటించిన సాంఘిక చిత్రం.





వినిమయ వనరులుగా పండగలు

వ్యాపారమూ, దాని లాభాపేక్షా ప్రవేశించాక ఏ పండగ అయినా- దాని అసలు స్వభావాన్ని కోల్పోతుంది. దీపావళి ఇందుకు మినహాయింపు కాదు. సాంప్రదాయం పేరిట వినిమయత్వం పెంచే ధోరణికి వ్యాపారం పునాది వేస్తుంది. ఆ తరహా విస్తృత ప్రచారం ద్వారా పండగకు కొత్త అర్థం ఆపాదిస్తుంది. ఇప్పుడు ధనతేరస్ దానిలో భాగమే! దీపావళికి ఎంతో కొంత బంగారం కొనుక్కోవాలి. పాత వస్తువులు వదిలేసి, కొత్తవి సమకూర్చుకోవాలి.. ఈ ఆలోచన పెంచటం వ్యాపార వృద్ధి కోసమే! మామూలు జనానికి దీపావళి ఎంత వెలుగు తెస్తుందో చెప్పలేం కానీ, వినిమయ, వ్యాపారాలకు మాత్రం వెలుగే వెలుగు! దసరా నుంచి సంక్రాంతి వరకూ సృష్టించే ఈ ప్రచార హంగామా దాదాపు 40 రెట్లు కొనుగోళ్లను పెంచుతుందని వాణిజ్య సమాఖ్య అంచనా! ప్రత్యేక ఆఫర్లు, ఉచితాలూ, బహుమతులూ ... ఇలాంటి ఆకర్షక మంత్రాలు చాలానే ఊరిస్తూ ఉంటాయి. ఖర్చును అనివార్యంగా పెంచే ఇలాంటి వినిమయ ఆకర్షణలు - చాలా కుటుంబాల్లో నిజమైన పండగ ఆనందాన్ని దూరం చేస్తాయి.

ఎకో-ఫ్రెండ్లీ దీపావళి

శబ్ద కాలుష్యం లేని దీపావళి చేసుకోవాలనే పర్యావరణ స్పృహ కూడా ఇటీవల కాలంలో పెరుగుతోంది. భారీ ఎత్తున కాల్చే బాణాసంచా కారణంగా దేశంలో రూ. పదివేల కోట్లు ఒక్కరోజులో అగ్గిపాలవుతున్నాయి. పెద్ద ఎత్తున చెత్త పేరుకుపోతోంది. ధ్వని, వాయు కాలుష్యం ఏర్పడుతుంది. బాణాసంచా కాలుస్తున్నప్పుడు దేశంలో సుమారు 8 వేల మంది పిల్లలు గాయపడుతున్నారు. అందులో 2 వేల మంది పిల్లలు చూపు కోల్పోతున్నారు. దీపావళి అంటే వెలుగే కానీ, చీకటి కాకూడదు! కాబట్టి- ఈ పర్యవసానాల మీద దృష్టి పెట్టాలి. ప్రమాదాల నివారణపై అప్రమత్తం కావాలి. దీనిపై కొన్ని స్వచ్ఛంద సంస్థలు ప్రచారం చేస్తున్నాయి. ఎకో-ఫ్రెండ్లీ (పర్యావరణ హిత) దీపావళిని ముందుకు తెస్తున్నాయి.
అలా అనుకున్నప్పుడు- మళ్లీ ఆముదపు దీపాలు, కటిక కట్టెల మంటలు, దిబ్బు దిబ్బు దీపావళి వైపు మొగ్గు చూపటమే శ్రేయస్కరం. ప్రజలకు, పర్యావరణానికి హితం చేకూర్చటం కన్నా- పండక్కి వేరే ప్రయోజనం ఇంకేం ఉంటుంది?

జీవితమే దీపావళి

దీపావళిలోని వెలుగునీడలు జీవితానికి సంకేతంగా భావిస్తారు. అందుకనే- 'చీకటి వెలుగుల రంగేళీ .. జీవితమే ఒక దీపావళి' అన్నారు సినీకవి. కటిక చీకటికి గరిష్ఠ కొలమానం అమావాస్య. వెలుగుల వెల్లువకు పతాక సన్నివేశం దీపావళి. ఈ రెండూ ఒకసారి తారసిల్లే పండగ ఇది. జీవితంలో ఇంతకుమించిన కష్టాల చీకట్లు ఉండవు. ఇంతకు హెచ్చిన సంతోషాల వెలుగులూ ఉండవు. కాబట్టే- సుఖదు:ఖాలకు, మంచిచెడ్డలకు, జయాపజయాలకూ దీపావళి నిండైన ప్రతీక. మన కథల్లోనూ, సినిమా గీతాల్లోనూ ఈ పోలికలతో కూడిన భావనలు తరచూ వెల్లువెత్తుతూనే ఉంటాయి. జీవితంలో తారసిల్లే మంచిచెడ్డలను దీపావళి సరంజామాతో పోలిక పెడతారు. 'జీవితం క్షణికమని చిచ్చుబుడ్డి చెబుతుంది. గువ్వలా బతకమని తారాజువ్వ చెబుతుంది. నిప్పుతోటి చెలగాటం ముప్పు తెచ్చి పెడుతుందని- తానందుకు సాక్ష్యమని టపాకాయ చెబుతుంది.' ఇలా తరచి తరచి చూస్తే- దీపావళి నిండా జీవితానికి సంబంధించిన ఫిలాసఫీ చాలానే ఉంటుంది.

పదాల్లో 'దీపం' వెలుగు

దీపం ప్రకాశానికి, వికాసానికి, ప్రగతికి, అభ్యుదయానికి ప్రతీక. నిప్పు, దీపం అనేవి మానవ ప్రస్థానానికి మూల మలుపులు. దీపం లేని మానవ జీవితం ఊహించలేం. అది మన వాడుక మాటల నిండా కాంతులీనుతూనే ఉంటుంది. అమ్మమ్మలు వినిపించే జ్ఞాపకాల్లో 'దీపాలు పెట్టే వేళప్పుడు' అని ప్రారంభమయ్యేవి చాలా ఉంటాయి. అమ్మాయి అందంగా ఉంటే- 'చిదిమిన దీపంలా ఉంది' అంటాం. 'దీపం సాక్షిగా ...' , 'దీపం కొండెక్కడం', 'దీపం కొడి గట్టడం', 'దీపాలు ఆర్పేయడం', 'ఆ బాబు ఆ ఇంటి దీపం', 'దీపస్తంభం', 'దీపతోరణం' ... వంటి మాటలు చాలానే ఉన్నాయి. చాలా భక్తి సినిమాల్లో ఆరిపోయే దీపాన్ని ఆరకుండా చూడడం ఉత్కంఠభరిత సన్నివేశం. దీపం నుంచి దీపాన్ని వెలిగించటం ప్రగతికి చిహ్నం. దీపాలు ఆర్పేయడం దివాళాకోరుతనం. 'దేవుడి సాక్షిగా గుళ్లోని దీపం ఆర్పడం' గ్రామీణ ప్రాంతాల్లో సత్య ప్రామాణికంగా భావిస్తారు. ఇంత ప్రాచుర్యం, ప్రాబల్యం ఉన్న దీపం- విద్యుత్ దీపాలు వచ్చాక- ట్యూబులైట్లు, ఎల్ఇడి లైట్ల వెలుగులో కొండెక్కిపోయే స్థితికి వచ్చింది. అయితే, జ్యోతీ ప్రజ్వలన, కాగడాల ప్రదర్శన వంటి సందర్భాల్లో మాట మారినా- వెలుగు మాత్రం ఎప్పటికీ పోదు!

డిజిటల్ మిత్రుడు



కృత్రిమ మేధ మిత్రుణ్ణి మరో రకంగా సజీవం చేసింది యుగెనియా కుయ్డా అనే సాంకేతిక శాస్త్రవేత్తకు. రష్యాకు చెందిన లూకా ఇంక్ అనే కృత్రిమ మేధకు సంబంధించిన స్టార్టప్ కంపెనీని స్నేహితుడు రోమన్ మజురెంకోతో కలసి స్థాపించింది యుగెనియా. కానీ మూడు నెలలకే మిత్రుడు రోమన్ కారు ప్రమాదంలో మరణించాడు. ఏడాదిన్నర తర్వాత కూడా ప్రాణ స్నేహితుని మరణాన్ని జీర్ణించుకోలేని యుగెనియా ఓ ప్రాజెక్ట్ ప్రారంభించింది. మిత్రుడు అభిరుచులు, అలవాట్లు, ఇష్టాయిష్టాలు, స్వభావాలు, జ్ఞాపకాలు, చిత్రాలు, వీడియోలు, వ్యాసాలు ఇలా అతడి అన్ని విషయాల్ని ప్రోది చేసి ఓ సాఫ్ట్‌వేర్ తయారుచేసింది. ఈ డిజిటల్ మెమొరీ ద్వారా ఏఐ చాట్‌బాట్‌ను రూపొందించింది. ఇది రోమన్ కృత్రిమ ఉనికిని ఏర్పాటు చేయగలిగింది. ఈ రోమన్ ఏఐ అవతార్‌తో మాట్లాడాలంటే యాపిల్ ఐఫోన్ యాప్స్ నుంచి లూకా యాప్ డౌన్‌లోడ్ చేసుకోవచ్చు. అలా ఆ యాప్ ద్వారా రోమన్ మిత్రులు, కుటుంబ సభ్యులు, సన్నిహితులు మాట్లాడుతున్నారట. అంతకుముందు వ్యక్తం చేయలేని ప్రేమను ఈ బాట్‌కు చెప్పి మనసు కదిలించుకుంది యుగెనియా. రోమన్ తల్లి అయితే యుగెనియా తనకు కన్నబిడ్డను శాశ్వతంగా మిగిల్చిందని కన్నీరు పెట్టుకుంది. అప్పుడెప్పుడో దూరమైన నేస్తాలకు తమ మనసులోని మాట చెప్పేందుకు గాజు సీసాల్లో లేఖ పెట్టి సముద్రంలోకి విడిచేవారు. అవి తమవారికి చేరతాయని భావించి సాంత్వన పొందేవారు. కానీ ఈ డిజిటల్ అవతార్‌తో లేఖలు చేరడమే కాదు 'నేనున్నాగా నేస్తం' అనే తీపి బదులు వినొచ్చు.

వింత లోకం

నాలుగేళ్లకు ఏడు భాషలు

రష్యా రాజధాని మాస్కోకు చెందిన నాలుగేళ్ల చిన్నారి బెల్లా దేవ్యాకినాతో అస్సలు మాట్లాడలేమని అంటున్నారు. ఎందుకంటే ఆ బుడత ఏకంగా ఏడు భాషల్ని గడగడమనేస్తోంది. శైలి, సరళికి ఏ మాత్రం పొంతన లేని ఇండో-యూరోపియన్, సెమిటిక్, సైనో-టిబెటన్ భాషా నిర్మాణాల్ని అర్థం చేసుకుని గుర్తుంచుకోవడం చాలా కష్టమైన విషయం. అలాంటిది బెల్లా మాతృ భాష రష్యన్‌తో పాటు ఇంగ్లిష్, ఫ్రెంచ్, స్పానిష్, జర్మన్, చైనీస్, అరబిక్ ఏ భాషలో ప్రశ్నించినా దిమ్మ తిరిగేలా సమాధానం చెప్పేస్తోంది. మాట్లాడటమే కాదు కొన్నింటిని చదవగలదు కూడా. డైనోసార్లు వంటి మిగతా విషయాల గురించి చక్కటి జ్ఞానం కూడా ఉంది. బెల్లా పాండిత్యం ప్రపంచానికి తెలిసింది కొన్ని రోజుల క్రితం ఆమె ఓ టీవీ టాలెంట్ షోలో పాల్గొన్నపుడే. కేవలం మాట్లాడటమే కాదు యాస కూడా తగ్గట్టుగా ఉండటంతో ప్రోగ్రామ్ జడ్జులు, వీక్షకులు ఆశ్చర్యపోయారు. ఇంటర్నెట్‌లోను బెల్లా మాటల వీడియోలు హల్‌చల్ చేయడంతో ఒక్కసారిగా సెలెబ్రెటీ అయిపోయింది. బహుభాషా కోవిదురాలని ఇప్పుడే అనొచ్చో లేదో గానీ పాలీగ్లాట్ అని మాత్రం కచ్చితంగా అనేయొచ్చు. ఇదంతా ఎలా సాధ్యమైందనే దానికి బెల్లా తల్లి యులియా సమాధానమిచ్చింది. బెల్లాకు రెండేళ్ల ఉన్నప్పుడే ఇంగ్లిష్ మాటలు పలకడం నేర్పించారట. వాటిని చాలా తేలిగ్గా పట్టేయడంతో ఒక్కో భాషను పెంచుకుంటూ పోయారట. కేవలం వీటి కోసమే ప్రత్యేకమైన ట్యూటర్లను పెట్టుకున్నారు. ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 1 వరకు మళ్లీ సాయంత్రం 5 నుంచి రాత్రి 8 గంటల వరకు తరగతులు పెట్టించారు. మూడున్నరేళ్ల కల్లా రెండు భాషల్లో అనర్గళంలా మాట్లాడేయడం మొదలెట్టింది. తర్వాత ఆరు నెలలకే మరో రెండు భాషల్ని గుక్క తిప్పుకోకుండా పలికేయగలిగింది. కానీ చాలామంది బెల్లా తల్లిదండ్రులను తప్పుబడుతున్నారు. బాల్యాన్ని దూరం చేస్తున్నారని, ఆరు గంటల పాటు శిక్షణ ఒత్తిడి కలిగిస్తుందని అంటున్నారు. అయితే ఈ తరగతులన్నీ ఆటల పాటల రూపంలోనే ఉంటాయని అందువల్ల బెల్లా సంతోషంగా నేర్చుకుంటుందని తల్లిదండ్రులు బదులిస్తున్నారు.

జొలోకియాతో మజాకాలొద్దు

మన దేశానికి చెందిన మిరప కాయ రకం భూత్ జొలోకియా చాలా హాట్ గురూ. ఎంత హాటంటే ఈ మధ్యే ఓ వ్యక్తి ఎమర్జెన్సీ ఆపరేషన్ చేయించుకోవాల్సి వచ్చింది. స్కావిల్లే స్కేల్‌లో మామూలు పచ్చి మిరప 15 వేలు- 30 వేల యూనిట్ల ఘాటుదనం కలిగుంటే ఇది ఏకంగా పది లక్షల యూనిట్ల ఘాటుంటుంది. ఈ



ఘోస్ట్ పెప్పర్ విదేశాల్లో బాగా పాపులర్ అయిపోయింది. బర్గర్‌లలో ఏదో కొంచెం ప్యూరీగా రాసి దాన్ని తినే పందేలు పెట్టుకుంటారు. ఇలాంటి పోటీల్లోనే పాల్గొన్నాడు అమెరికాకు చెందిన 47 ఏళ్ల ఓ వ్యక్తి. బర్గర్ మీద భూత్ జొలోకియాతో చేసిన ప్యూరీ ఎక్కువ రాయడంతో నోట్లోకి వెళ్లగానే దాని మంటకు అన్నవాహికకు రంధ్రం పడింది. విపరీతమైన ఛాతీ, కడుపు నొప్పితో ఆస్పత్రికి వెళ్తే స్కానింగ్ తదితర పరీక్షలు చేసి బోయర్హావే సిండ్రోమ్ అదే అన్నవాహికకు రెండున్నర సెం.మీ. చిల్లు పడిందని వైద్యులు తేల్చారు. శరీరంలోకి చొచ్చుకెళ్లిన ఆహారాన్ని తీసేసి ఊపిరి తీసుకోడానికి వీలుగా ఓ ట్యూబ్ వేశారు వైద్యులు. అది గాయం మానేంత వరకు రెండు వారాలపాటు ఉంచుకోవాలి. మరో 9 రోజులు ఆస్పత్రిలో ఉన్నాక గానీ ఇంటికి పంపించారు. ఈ ఆపరేషన్ సరైన సమయంలో జరక్కపోతే మనోడికి ఈ భూమ్మీద బర్గర్‌లు చెల్లిపోయిండేవి. తిండి పోటీలంటే మండిపోతుంది.

విరిగిపోయిన బకెట్ దడదడమని అదరగొట్టే డ్రమ్ము అవుతుంది. గొడుగుకు తీగెలు లాగి టబ్ జోడిస్తే గిటారు అవుతుంది. పగిలిన కంచం బీట్ డ్యాన్స్ చేయిస్తుంది. 'ధారావి రాక్స్' అనే స్లమ్ స్టార్‌ల బ్యాండ్ ఉర్రూతలూగిస్తుంది. బాలీవుడ్ సూపర్‌స్టార్‌లు వీరి ప్రతిభకు ఫిదా అయిపోయారు. సంగీత దర్శకులు వీరికి గురువులుగా మారిపోయారు. సేకరించే చెత్తలోనే సంగీత ప్రపంచాన్ని మీటిన ఈ స్కావెంజర్ల మ్యూజిక్ బిగ్గరగా ప్రతిధ్వనిస్తోంది. అభిమానుల చప్పట్లతో హోరెత్తుతోంది.

స్లమ్‌లో రాక్ స్టార్‌లు

ముంబయ్ మహానగరంలోని ధారావి ఆసియాలోనే అతిపెద్ద మురికివాడగా చెబుతారు. ఈ మురికివాడలో సుమారు లక్ష మందికిపైగా చెత్త సేకరించే వాళ్లు నివసిస్తుంటారు. వీళ్లంతా చెత్తా, మురుగునీరు ఉన్న చాలా ప్రమాదకరమైన ప్రాంతాల్లో పనిచేస్తుంటారు. వీరిలో అధిక సంఖ్యలో పిల్లలే ఉంటారు. రోజంతా రోడ్లపై తిరిగి ఒక చిన్న రొట్టె ముక్క కోసం చస్తూ బతుకుతూ అదే రోడ్లపై పడుకునే వారు నిత్యం కనిపిస్తునే ఉంటారు. ఇలాంటి మురికివాడలో కొత్త చప్పుడు చేస్తూ 'ధారావి రాక్స్ బ్యాండ్' పుట్టింది. ఈ బ్యాండ్‌లో ఉపయోగించే మ్యూజికల్ ఇన్‌స్ట్రుమెంట్స్ ఏంటో తెలుసా? చెత్త ఏరుకునే పిల్లలు సేకరించిన చెత్తాచెదారమే. నీటినిల్వను చేసుకోవడానికి ముంబయి ప్రజలు వాడే పెద్ద పెద్ద నీటి ట్యాంకర్లు, ప్లాస్టిక్ డబ్బాలు, పగిలిపోయిన బాటిల్స్, సీసా మూతలు, ఇంకా చాలా మనకు అవసరం లేవనుకుని పారేసినవన్నీ వీరి చేతుల్లో వాద్య పరికరాలుగా మారిపోతున్నాయి.

గదిలో పుట్టి వీధిలో పెరిగి

ఈ పిల్లలు వారి రోజు మొత్తంలో చెత్తను ఏరే పనిని పూర్తిచేసుకుని నేరుగా సంగీతంతో మమేకమయ్యే చిన్నపాటి గదిలోకి పరిగెత్తుకుని మరి వస్తారు. రోజంతా పడిన కష్టాన్ని ఇక్కడ ఉండే కొద్ది క్షణాల్లోనే మర్చిపోతారు. ఎవరికి చేయితిరిగిన వాద్యాన్ని అందుకుని సరదాగా పాటలు పాడుతూ, చిందులు వేస్తూ సందడి చేస్తారు. వీరికిదో వ్యసనం. వారు ప్రాక్టీస్ చేసే గదినే కాదు, సంగీత పరికరాలను కూడా వారే స్వయంగా తయారు చేసుకున్నారు. వీరి సంగీతం గదిని దాటి వీధుల్లోను మార్మోగింది. చిన్న చిన్న పండుగలు, క్రికెట్ మ్యాచ్‌లు, వేడుకలు వగైరాలన్నిటా వీరి బ్యాండ్ బజాయిస్తారు. అది చాలా పాపులర్ అయ్యి పెద్దల్ని ఆకట్టుకుంది. అది ఎంతలా అంటే ముంబయి ప్రజల మనసును దోచుకునేంతలా! ముంబయిలో నివసిస్తున్న యువ సంగీత కళాకారుడు అభిజిత్ జేజురికార్ ఈ పిల్లల గురించి తెలుసుకున్నాడు. వీరి నైపుణ్యానికి ప్రభావితుడయ్యి వీళ్లల్లో ఒకరిగా కలిసిపోయాడు. అంతే కాదండోయ్! వీరికి సంగీతం కూడా నేర్పిస్తున్నాడు. అతికొద్ది సమయంలోనే ఈ పిల్లలు స్టేజీల మీద వారి ప్రతిభను ప్రదర్శించడం మొదలుపెట్టారు.

ఇంతవరకు ఈ పిల్లలు సుమారు యాభైకి పైగా స్టేజ్ షోలు చేసి, ప్రజల మనసులు దోచుకున్నారు. దేశ, విదేశాల నుంచి కూడా ఈ పిల్లలకు సంగీతం నేర్పించడానికి చాలామంది వస్తుంటారు. వీళ్లు చాలామంది సినీ నటులను కూడా కలిసారు. షారూక్‌ఖాన్, సల్మాన్‌ఖాన్, కత్రీనాకైఫ్ వంటి తారల మెప్పు పొందారు. చాలామంది సింగర్స్ కూడా వర్క్‌షాప్ ద్వారా మాకు సంగీతం నేర్పించారు. సంగీత్ రావ్, అభిజిత్ వీరికి క్రమశిక్షణ, నిగ్రహంతో ఎలా వుండాలో నేర్పించారు.

బ్యాండ్ బంధం

ఈ బ్యాండ్ ద్వారా స్థానికంగా చెత్తఏరుకునే పిల్లలంతా ఒక్కటయ్యారు. ఈ బ్యాండ్ ట్రూప్ రాక ముందు ఈ పిల్లల్లో కొందరు మద్యానికి బానిసలుగా ఉన్నారు. దొంగతనాలు చేసేవారు కొందరయితే, ఇంట్లో నుంచి పారిపోయి వచ్చినవారు మరికొందరు. వీళ్లకూ అందరి పిల్లల్లానే ఆడుకోవాలి, డ్యాన్స్ చేయాలి అని ఉంటుంది. ధారవి రాక్స్ బ్యాండ్ అలాంటి వారికి వేదికగా మారింది. నగరానికి చెందిన అడ్వకేట్ వినోద్ శెట్టి మురికివాడల పిల్లల సంక్షేమానికి 2005లో 'ఎకార్న్ ఫౌండేషన్' స్థాపించి పని చేస్తున్నారు. ఈయనకు చెత్తతో సంగీతం సృష్టిస్తున్న పిల్లలు కనిపించారు. వీరు సందడి చేస్తున్న గదికి ఆయనా వెళ్లాడు. వారి ప్రతిభకు తెలీకుండానే చేతులు కలిశాయి. వీరి పాటలు విని, క్రమ క్రమంగా మరింతమంది పిల్లలు అక్కడికి రావడం మొదలుపెట్టారు. ఈ ప్రభావాన్ని స్పష్టంగా గమనించిన ఆయన అందర్నీ పోగుచేసి అలా అదో పెద్ద బ్యాండ్‌గా మార్చి ప్రముఖ కళా కేంద్రాల్లో స్టేజ్ ప్రదర్శనల్ని ఇప్పించాడు. రాక్ సంగీతాన్ని పట్టేయడంతో ధారవి రాక్స్‌గా పేరు సంపాదించింది. ఇప్పుడు ధారవీ రాక్స్ బ్యాండ్ బృందంలో 8–18 ఏళ్ల వయసు గల సుమారు 20–25 మంది పిల్లలు ఉన్నారు.

పెంచుతూ వెళ్లాలి

ఈ బ్యాండ్‌కి ఇంకో ప్రత్యేకత ఉంది. ఎవరైనా వారికివారుగా బ్యాండ్ నుంచి వెళ్ళిపోవాలి అనుకుంటే వారే స్వయంగా ఇంకొంత మంది పేద పిల్లల్ని ఇందులో చేరుస్తారు. ఇలా చేయడం వల్ల వేరే పిల్లలకు అవకాశం వస్తుందనేది వీరి ఆలోచన. ఈ బ్యాండ్ ద్వారా అందిన డబ్బుతో కేవలం సంగీతం నేర్చుకోవడమే కాకుండా సేకరించిన చెత్తను రీసైకింగ్ చేస్తున్నారు.

– అమల తిలారు



నా కళ్లతో

అబుధాబి యు.ఏ.ఇలో అన్నింటి కంటే విశాలమైన దేశం. జనాభా 20 లక్షలతో దుబాయ్ తర్వాత రెండవది. ఇక్కడ మొట్టమొదటగా ముత్యాల వ్యాపారం సాగేది. ఈ వ్యాపారం దెబ్బతిన్నాక 1930 నుండి ఆయిల్ ఉత్పత్తులు ప్రారంభమయ్యాయి. జూన్ నుండి సెప్టెంబరు వరకు వేడి ఎక్కువగా ఉంటుంది. అబుధాబి దేశ ముఖ్య పట్టణం అబుధాబిని 1967లో జపాన్ ఆర్కిటెక్ట్ తకాహాషి ప్లాను చేశాడు. ఇక్కడ తొంబై శాతం ఖర్జూరం చెట్లు. చదువు అరబ్ భాషతో పాటు ఇంగ్లీషులోనూ సాగుతుంది.

షేక్ జాయద్ గ్రాండ్ మసీదు

ఖర్య

ఎక్కువగా సినిమా షూటింగులు జరుగుతుంటాయి. ప్రత్యేకంగా భారతదేశపు షూటింగులు ఎక్కువ. వలసలుగా వచ్చి నివసించేది ఇండియా, నేపాల్, పాకిస్తాన్, ఇథియోపియా, సోమాలియా, బంగ్లాదేశ్, శ్రీలంక, ఫిలిప్పీన్, ఇంగ్లాండు దేశాల నుండి వచ్చినవారు.

ఉప్పు నీరే మంచినీరుగా..

రోడ్లు విశాలంగాను, సరళ రేఖలు గీచినట్లు సమాంతరంగా అద్దాల్లా మెరుస్తుంటాయి. పరిశుభ్రతకు పెట్టింది పేరు. అడుగడుగునా కెమెరాలు అమర్చబడి వుంటాయి. రక్షక భటుల ప్రమేయం తక్కువ. ఉప్పు నీటిని మంచినీరుగా మార్చి నీరు సరఫరా చెయ్యబడుతుంది. ఉద్యోగుల జీతాల్లో ట్యాక్స్ కోతలుండవు. కొన్న వస్తువులకు ట్యాక్స్ చెల్లించాల్సిన అవసరం లేదు. పెద్ద పెద్ద వృక్షాలుండవు. రోడ్డు పక్క క్రోటన్ మొక్కలు, ఖర్జూరం చెట్లు పెంచబడ్డాయి. భవనాల చుట్టు పూలమొక్కలు, గరిక తప్పకుండా వుంటాయి. సూర్యోదయాన్ని, అస్తమయాన్ని చూడ్డం మనసుకు ఆహ్లాదం కలిగించే అనుభూతి. ఉదయం సూర్యుడు భూమిలోంచి పైకి వస్తున్నట్లు సాయంత్రం భూమిలోకి దిగుతున్నట్లు కనిపిస్తుంది.

విదేశీ కార్మికుల పట్ల బాధ్యతగా వ్యవహరించటం లేదని మానవ హక్కుల సంఘాల విమర్శల్ని ఎదుర్కొంటుంది. ఇక్కడ రాజరిక పాలన. టోల్‌గేట్లు లేవు.

తొలి పాలరాతి మసీదు

అబుదాభిలో అత్యంత పెద్దది ప్రపంచంలో అతిముఖ్యమైన షేక్ జాయద్ గ్రాండ్ మసీదు 1996లో ప్రారంభించబడి 2007లో పూర్తి చెయ్యబడింది. షేక్ జాయద్ అబుధాబి రాజు. యు.ఏ.ఇ ఏర్పడ్డాక దానికి ప్రెసిడెంటు. మసీదు వీరి పేరున నిర్మితమైంది. 30 ఎకరాల వైశాల్యంలో 1380 అడుగుల పొడవు 960 అడుగుల వెడల్పుగలది. దీన్ని ఇటలీ కంపెనీ నిర్మించింది. వేల మంది ప్రార్థనలు చేసుకోవచ్చు. నిర్మాణానికి కార్మికుల్ని సామగ్రిని ఇండియా, ఇటలీ, జర్మనీ, మొరాకో, పాకిస్తాన్, టర్కీ, మలేషియా, ఇరాన్, చైనా, ఇంగ్లాండు, న్యూజిలాండు నుండి తీసుకురావటం జరిగింది. పర్షియన్, మొగల్ ఆర్కిటెక్చర్ ప్రకారం నిర్మించబడింది. ఇందులో బంగారు, వజ్రాలు, పాలరాయి, పింగాణి తదితరం వాడారు. 75 అడుగుల ఎత్తులో సీలింగు వుంది. 1500 మంది స్త్రీలు ప్రార్థనలు చేసుకోవటానికి ప్రత్యేకంగా స్థలం కేటాయించారు. ప్రపంచంలో మొత్తం పాలరాయితో నిర్మించబడిన మొట్టమొదటి మసీదు. 3000 మంది కార్మికులు 38 మంది కాంట్రాక్టు కంపెనీలు నిర్మాణంలో పాల్గొన్నాయి. స్తంభాలన్నీ ఖర్జూరం చెట్టు నమూనాతో ఉంటాయి. మసీదు చుట్టూ జలాశయాలు వున్నాయి.

ఆధునిక సాంకేతిక నైపుణ్యంతో నిర్మించిన ఈ కట్టడంపై కళాత్మకంగా చిత్రాల్ని చిత్రించటం జరిగింది. వేలాడదీసిన షాండ్లయర్స్ (లస్తర్లు) పాలరాతి ఫ్లోరింగు, విశాలమైన దారులు, గోడలకు వాడిన పింగాణి, ఇరాన్ కార్పెట్లు, నాలుగు మినార్లు చూపుల్ని ఆశ్చర్యంలో ముంచి ఆనందం పంచుతాయి. ఈ మహాద్భుత నిర్మాణం మనస్సులో చిరకాలం నిలిచిపోతుంది. విదేశీ నాయకులు విచ్చేసినప్పుడు దీన్ని వీక్షించటం కార్యక్రమాల్లో ఒకటిగా పొందుపరచబడుతుంది. పురుషులు ఏ దుస్తులతోనైనా మసీదులో ప్రవేశించవచ్చు. స్త్రీలు మాత్రం బుర్ఖాలు ధరించాలి. లేనివారికి నిర్వాహకులు ఉచితంగా సరఫరా చేస్తారు. కార్యక్రమం పూర్తయ్యాక తిరిగి ఇచ్చేయాలి. మసీదు ప్రవేశానికి రుసుం లేదు.

మసీదుకు ఎదురుగా నిలిచి నాలుగు మినార్ల మధ్య చంద్రుణ్ని చూడ్డం అపూర్వ సన్నివేశం. అవధులు దాటిన ఆహ్లాదం.

అబుధాబి భారతదేశానికి 3000 కిలోమీటర్ల దూరంలో

అరబ్ కేంద్రంగా...

వుంది. విమానప్రయాణం 4 గంటల 30 నిమిషాలు. మధ్యలో ఎక్కడా ఆగటం వుండదు. 1971లో యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ స్థాపించబడింది. అప్పటి వరకు స్వతంత్ర పాలన సాగిస్తున్న ఏడు దేశాలు అబుధాబి, అజ్‌మాన్, దుబాయ్, ఫజైరా, రాస్ అల్ ఖైమా, షార్జా, ఉమ్ అల్ ఖ్వయిన్ కలిసి యు.ఏ.ఇ గా ఏర్పడ్డాయి. ఇస్లాం మతానికి అరబ్ అధికార భాష. ఇంగ్లీషు అన్ని దేశాల్లో మాట్లాడేభాష. ప్రత్యేకంగా అబుధాబి దుబాయ్‌లలో. ఏడు దేశాధినేతల్లో ఒకరిని యు.ఏ.ఇ కి ప్రెసిడెంటుగా ఎన్నుకుంటారు. మొట్టమొదటి అధ్యక్షుడు అబుధాబి రాజు. బహరైన్, ఖతార్ దేశాల్ని కూడా ఆహ్వానించటం జరిగింది. కానీ అవి చేరటానికి తిరస్కరించాయి. ఆయిల్, సహజ వాయువులు యు.ఏ.ఇని ఆర్థికంగా బలిష్టం చేశాయి. పరిపాలనకు కావల్సిన ఆర్థిక వనరులు ఇందులో చేరిన ఏడుదేశాలు సమకూర్చుతాయి. ఇక్కడ ముస్లింలు 77శాతం, కాథలిక్కులు 10 శాతం, హిందువులు 4 శాతం, బౌద్ధులు 2 శాతం వున్నారు.

ార దేశం
జ



ఖర్జూర చెట్ల మధ్య నడకదారి

మామ్మోత్‌ను చూసి..

బీచ్ దగ్గర ఏర్పాటు చేసిన ప్రదర్శనలో 'ఊలి
ామ్మోత్' (ఆది ఏనుగు జాతి) జంతువు ఆస్థి
ంజరం వుంది. ఇది 1990లో దొరికింది. దీని
డవు 4 మీటర్లు. బరువు 12 టన్నులు. దంతాల
డవు 5 మీటర్లు. దాదాపు 70 సంవత్సరాలు
విస్తుంది. మంచు యుగం నాటి ఆఫ్రికాకు చెందిన
ఊలి మామ్మోత్‌లు అక్కడి కరువును తట్టుకోలేక
లి ప్రాంతమైన యూరేషియాకు వలస వెళ్లాయి.
జుకు 60 నుండి 200 కేజీల ఆహారం 60 నుండి
60 లీటర్ల నీళ్లు కావాలి. 16 నుండి 18 గంటల
రకు ఆహారం కోసం తిరుగుతుంది. ఈ జాతి 15
ల ఏళ్ల కిందట చలిని తట్టుకోలేక అంతమైంది.
ి తర్వాత దశ 'ఏనుగు' అని పరిశోధనలో తేలింది.

అబుధాబికి 166 కిలో మీటర్ల దూరంలో అలైన్
ట్టణం వుంది. ఒక గంట ముప్పై నిమిషాల
యాణం. దారి పొడవునా ఇరువైపుల పెంచిన
ర్జూరం చెట్లు వున్నాయి. పక్కనే ఎడారి. ఇసుక
న్ని చోట్ల దిబ్బలు దిబ్బలుగా కొన్ని చోట్ల కొండలు
ండలుగా వుంది. సూర్యరశ్మి ఇసుక పొదలపై పడి
రుపులు చిందిస్తూ వుంది. ఎండమావులు నాట్యం
స్తున్నాయి.

నేషనల్ మ్యూజియం దగ్గర అలైన్
యాసిస్‌లో 3000 ఎకరాల్లో 1,47,000 ఖర్జూరం
ట్లు ఉన్నాయి. ఈ ఉత్పత్తులను యునైటెడ్ నేషన్స్
పుడ్ అండ్ అగ్రికల్చర్ ఆర్గనైజేషన్ గుర్తించింది. దీన్ని గ్లోబల్లీ ఇంపార్టెంట్ అగ్రికల్చర్ హెరిటేజ్ సిస్టమ్ ప్రశంసించింది. ఇక్కడ ఇలాంటి ఏడు ఒయాసిస్సులున్నాయి.



ప్రదర్శనలో ఊలీ మామ్మోత్ అస్థిపంజరం

భూగర్భ వ్యవసాయానికి ఈ ఒయాసిస్ పేరు పొందింది. కావాల్సిన నీరు బోరు బావుల ద్వారా చెట్ల మధ్య నిర్మించిన పెద్దపెద్ద ట్యాంకుల్లో నింపుతారు. ట్యాంకుల నుండి కట్టిన చిన్నచిన్న కాలువల ద్వారా చెట్లకు నీరు అందిస్తారు.

ఖర్జూరం చెట్ల దిగుబడి చాలా ఎక్కువగా ఉంది. సక్రమ నిర్వహణ కనిపించలేదు. పండిన ఫలాల్ని సకాలంలో కోస్తున్నట్టు లేదు. చెట్ల కింద పండ్లు గుట్టలు గుట్టలుగా రాలి మట్టిలో కలిసిపోతున్నాయి.

ఇక్కడ రోడ్లు, ఫుట్‌పాత్‌లు, సబ్‌వేలు, ప్రహరీ గోడలు, ట్రాఫిక్ సిగ్నల్ స్తంభాలు ఇలా ప్రతి ఒక్కటి అందంగా తీర్చిదిద్దబడ్డాయి. ప్రత్యేకంగా పరిశుభ్రత గురించి చెప్పుకోవాలి. ఒక్కో దాంట్లో ఒక్కో శోభ కనపడుతుంది.

ఈ పట్టణం పక్కనే 20 అడుగుల ఎత్తు 'ఒమన్' దేశ సరిహద్దు వెల్డ్ మెష్ కంచె వుంది. ఫుట్‌పాత్‌పై నడుస్తూ చేతి పక్కనే వున్న కంచెలోంచి ఒమన్ దేశాన్ని చూసి అస్వాదించడం వింత అనుభూతి.

- అడిగోపుల వెంకటరత్నమ్
9848252946



మసీదు వద్ద వ్యాసకర్త

- ఫోటోలు :నరేష్

రణభేరి

వింటావా? సడి వింటావా?
నా అంతరంగాన ఎగసిపడే
కెరటాల హోరు వింటావా?
ఇది ఆగక సాగే సాగర ఘోష
మనిషిని నడిపే జీవశ్వాస
నాకు మాత్రముండదా?
శాంతితో బ్రతకాలని
ప్రశాంతంగా జీవించాలని
అక్షర యోధుడు పెన్ను మూసెయ్యలేడు
చెవి చుట్టూ జోరీగలు తిరుగుతుంటే
ఆదమరచి నిద్రెలా పోగలను?
సమాజంలో ఇన్ని అన్యాయాల్ని
అక్రమాలను చూస్తూ
మనసునెలా జోకొట్టగలను?
నా కలం కరవాళమై కదనుతొక్కుతోంది
చైతన్యం లేని మనిషి
నిర్జీవమే కదా?
స్వార్థంతో బ్రతికేబ్రతుకు
నికృష్టమే కదా?
ఒక చేతికి వేల చేతులు
ఊత మవ్వాలి
ఒక నోటికి లక్షల నోళ్లు
బలమవ్వాలి
ప్రబలమై పోతోంది వ్రణం
ఇక రణమే శరణ్యం

- తోట శ్రీనివాసరావు
8977066980

దీపావళి కొత్తగా

చిచ్చు బుడ్లంటే
నాకెంతో ఇష్టం
వాటి రవ్వల వెలుగుటద్దాల్లో
నాకెన్నో దిగులు ముఖాలు
కనిపిస్తాయి
కాకర పువ్వొత్తులంటే
నాకు మరీ ఇష్టం
వెలుగుతున్నంత సేపూ వెలిగి
ఆరిపోయే
కలల్ని ప్రతిబింబిస్తాయవి
భూచక్రాలన్నా నాకిష్టం
భూమి సూర్యుడి చుట్టూ కాకుండా
డబ్బు చుట్టూ తిరుగుతుందని
పాఠం చెప్తాయవి
తారా జువ్వలంటే నాకు
చాలా ఇష్టం
ఆకాశాన్నంటే ధరలతో
అవెప్పుడూ
పోటీ పడుతుంటాయని
లక్ష్మీ బాంబులన్నా నాకిష్టం
నా పేదింటి తలుపెప్పుడూ
తట్టని లక్ష్మీ దేవి బొమ్మ
కాగితాలు ముక్కలై పేలిపోతాయని
ఉల్లిపాయ బాంబులంటే కూడా
ఎంతో ఇష్టం నాకు
పేలేదాకా ఎందుకు
కొనేటప్పుడే
కన్నీళ్లు తెప్పిస్తాయవి
మొత్తానికి టపాకాయలంటే
ఎంతగానో ఇష్టం నాకు
అవినీతి, లంచగొండితనం,
ఆశ్రిత పక్షపాతం
టపా కొట్టేలా ఏనాటికయినా
పేలుతాయనే ఆశను కల్పిస్తాయవి
మొత్తానికి దీపావళి అంటే నాకు ఎంతో ఇష్టం
రోజుకో నరకాసురుడు పుట్టుకొస్తున్నా...
ఒక్క సత్య భామను కూడా
తయారు చేయలేక పోతున్న
ఈ వ్యవస్థను ఎప్పటికయినా మందలిస్తుందనీ...
మరియు....
ఇన్ని సంవత్సరాలుగా
ఎన్ని దీపాలు వెలిగించినా నిరుపేదల బతుకుల్లో ఇంకా
చీకటి మిగిలే వుందని
ఎప్పటికప్పుడు కొత్తగా బోధిస్తూ వుంటుందనీను...!!

- చిత్తలూరి
9133832246

విజేత

రెండో పరుగు

ఆమె పరుగు ఆకలిని మింగింది. ప్లాస్టిక్ పట్టాల ఇంటిని దాటింది. పల్లెను దాటి జాతీయ మైదానాల్లో రివ్వున సాగింది. అంతర్జాతీయ వేదికల్లో దూసుకుపోయింది. ఆమె పరుగును ఆపడానికి దారిలో ఓ శిల అడ్డొచ్చింది. ఆండ్రోజెన్ ఇన్‌సెన్సిటివ్ సిండ్రోమ్ దాని పేరు. నువ్వు స్త్రీ కావు పురుషుడివి అని ఒక్కసారిగా అనర్హత వేటు పడింది. ఆమె పరుగుల లోకం ఒక్కసారిగా స్తంభించిపోయింది. పరుగే ఊపిరిగా బతికిన ఈ జగజ్జేత ఆత్మహత్య యత్నం విఫలమైంది. పదేళ్లు దాటాక ఆడ చిరుత గురించి ఒక్క మాట లేదు.. పట్టింపు లేదు ఈ పరుగుల ప్రపంచంలో. సాటి ప్రపంచానికి తనెంటో నిరూపించుకునేందుకు ఇప్పుడు మళ్లీ ట్రాక్‌లోకి వచ్చింది. కోచ్‌గా యువ చిరుతల్ని పరుగులు తీయిస్తోంది. తమిళనాడు స్టార్ అథ్లెట్ శాంతి సౌందర రాజన్ మళ్లీ గన్ షాట్ వింటోంది.

అథ్లెట్ జీవితంలో ఒక ఏడాది వెనుకబాటు అంటేనే కెరీర్ తలకిందులయ్యే విషయం. అలాంటిది పదేళ్ల పాటు ట్రాక్ పక్కన నిలబెట్టేస్తే శాంతి సౌందర రాజన్ ఏమైపోతుంది. అది కూడా అనుమానాస్పదమైన పరీక్షల ద్వారా ఆమె జెండర్‌నే ప్రశ్నల్లో పడేస్తే ఇంకేమౌతుంది. 12 అంతర్జాతీయ పతకాల్ని దేశానికి అందించిన శాంతి 2006 దోహాలో జరిగిన ఏసియన్ గేమ్స్‌లోను రెండో స్థానంలో నిలిచింది. కానీ ఆమె జెండర్ టెస్ట్‌లో విఫలమైందంటూ చేసిన ఒక్క ప్రకటనతో అటు క్రీడా జీవితం, ఇటు సామాజిక జీవితం నాశనమైపోయాయి. హైపర్ ఆండ్రోజినిజమ్ కండిషన్ ఉందని తేలింది. అంటే మహిళ దేహంలో పురుష హార్మోన్‌గా చెప్పబడే టెస్టోస్టిరాన్ అత్యధిక మోతాదులో ఉందని నిర్ధారణ అయ్యింది. దాని పేరుతో ఆమెకు అనర్హత వేటు పడింది. ఇదే కాదు ఆండ్రోజెన్ ఇన్‌సెన్సిటివ్ సిండ్రోమ్ అనేది లింగ పర్యవసానాల మరో సమస్య. పురుషుడి జన్యువులే ఉన్నా కూడా స్త్రీ లక్షణాలే ప్రస్ఫుటమై మహిళగానే వ్యక్తి పెరిగే అరుదైన సమస్య. వీటి నిర్ధారణలో కూడా అనేక వివాదాలున్నాయి. ఈ సమస్య శాంతి సౌందర రాజన్‌యే కాదు ఇప్పటి సంచలన అథ్లెట్ ద్యుతీ చంద్, దక్షిణాఫ్రికాకు చెందిన కాస్టర్ సెమెన్యాది ఇదే సమస్య. కానీ వారికి ఈ మధ్యే అడ్డంకులు తొలగిపోయాయి. వీళ్లే కాదు ఏ క్రీడాకారుడికైా జన్యువుల విషయంలో ఏదో ఒక ఆధిపత్యం కలిసి వస్తుంది. ఏదో ఒక శారీరక ప్రత్యేకత మిగతా వారి కన్నా ముందు నిలబెడుతుంది. ఒలింపిక్ స్టార్ అథ్లెట్ మూడు స్వర్ణాల విజేత నాన్సీ హాగ్స్‌హెడ్-మకర్ అన్న మాట ఇది. జెనెటిక్ అడ్వాంటేజ్‌ను ప్రతి విజేతలోను గమనించవచ్చు. ఈమె మాట, వారి పరుగు చప్పుడే సౌందర రాజన్ జీవితంలో మళ్లీ శబ్దం తెచ్చింది. ఇప్పుడు మళ్లీ ఆమె పేరు వినబడేలా చేసింది. ఈ మధ్యే సౌందర రాజన్‌ను కోచ్‌గా నియమిస్తూ భారత అథ్లెటిక్స్ క్రీడా ప్రాధికార సంస్థ నిర్ణయం తీసుకుంది. ఇది ఆమె సామాజిక జీవితానికే సెకండ్ ఇన్నింగ్స్.

తొలి పరుగు

శాంతి సౌందర రాజన్ పుట్టింది నలుగురు తోబుట్టువులు ఉన్న నిరుపేద కుటుంబంలో. తల్లిదండ్రులంతా కలసి ఓ చిన్న గుడిసెలో అది సిమెంట్ సంచులతో సర్దుబాటు చేసినింట్లో. ఇటుకల బట్టీలో పని. విద్యుత్ అంటే తెలీదు. తాగునీరు రుచి తెలీదు. కానీ ఆకలి అంటే మాత్రం బాగా తెలుసు. ఎందుకంటే ఆరుగురు కలసి ఆరు ముద్దలు తినే రోజు పండుగే ఆ ఇంట్లో. అలాంటి పరిస్థితుల్లో పెరిగిన ఆమెకు ఓ విషయం మాత్రం తెలీకుండా పెదాలు విప్పారేలా చేసేది. అది పరుగు. తన కష్టాలకు దూరంగా పారిపోయే అవకాశంగానో... ఏవో ఆశలు, కలల్ని అందుకోవాలనే తపనో.. ఆమెను లంఘించేది. రివ్వున గువ్వ పిట్టలతో పోటీ పడి ఆమె ఒట్టి పాదాలు భూమిని బలంగా మోదుతూ కను చూపులో క్షణాల్లో అదృశ్యమయ్యేది. ఆకలి పేగుల్ని పీకుతుంటే మరింత కసితో కాళ్లను ఆడించేది. ఈ ఆవేశమో, ఆమె వేగమో తెలీదు కానీ ముళ్ల దారుల నుంచి ఆమె పాదాల్ని మట్టి ట్రాక్‌లోకి మరల్చింది. జాతీయ, అంతర్జాతీయ స్థాయిల్లో తన సత్తా చాటింది. ఆ తర్వాత ఇలా అనర్హత వేటు పడటంతో ఆమె స్థితి మళ్లీ పేదరికంలోకి మళ్లింది.

ఇటుక బట్టీ కూలీగా..

2012లో ఓ ప్రముఖ దిన పత్రిక మాజీ స్టార్ అథ్లెట్ల గురించి కొన్ని ప్రత్యేక వ్యాసాలు రూపొందించింది. అలానే శాంతి సౌందరరాజన్ గురించి వాకబు చేసి ఆమె ఇంటర్వ్యూ కోసం వెళ్లింది. అక్కడ పత్రికా

ప్రతినిధులకు ఆమె ఇటుక బట్టీల్లో తన తల్లిదండ్రులు, తోబుట్టువులతో కలసి కూలీ పనిచేయడం కనిపించింది. అంతర్జాతీయ క్రీడా ప్రాంగణాల్లో వేలాది మంది అభిమానుల చప్పట్ల మధ్య చిరుతలా దూసుకుపోయిన ఓ జగజ్జేత అలా ఓ అనామకురాలిగా జీవితాన్ని వెళ్లదీస్తుండటం కలచివేసింది. వెంటనే ఆమె దయనీయ పరిస్థితిపై వార్తలు వెలువరిస్తేనే గానీ ప్రభుత్వాలు పట్టించుకోలేదు. ఆసరాగా వచ్చిన డబ్బుతోనే చెల్లెళ్ల పెళ్లి చేసిన శాంతి మళ్లీ పేదరికంలోకి వెళ్లిపోయింది. 2014లో శాయ్ కాంట్రాక్ట్ కోచ్‌గా ఉద్యోగాన్నిచ్చినా అందే గౌరవ భృతి తక్కువే. తమిళనాడులోని మయిలాదుతురాజ్ శాయ్ కేంద్రంలో శిక్షణనిస్తోంది. ఈ మధ్యే జాతీయ కోచ్‌గా శాశ్వత ఉద్యోగానికి ఎంపికవడంతో ఆమె జీవితంలో రెండో ఇన్నింగ్స్ మొదలైంది. అయితే ఇది కూడా సామాజిక మాధ్యమాల ఆన్‌లైన్ పిటిషన్ల తాకిడితో, హైకోర్టు ప్లీలతో, జాతీయ షెడ్యూల్ కులాల కమిషన్ నోటీసుల ద్వారా అవకాశం దక్కింది.

- జశ్వన్



కథ

జామీను పావురం

- రఘు ఆళ్ల
9985502959

ట్రిం గ్గ్గ్గ్

భోజనం గంట అది.

జైల్లోని ఖైదీలందరు పళ్లాలు పట్టుకొని లైన్లో నుంచోడానికి పరుగులు తీస్తున్నారు.

కొంత మంది ఖైదీలు వడ్డించడానికి సిద్ధపడుతున్నారు.అంత అన్నం ముద్ద, రుచిలేని సాంబార్ అందులో దొరికే మిరపకాయల కోసం ఆరాటం.

చుట్టూ గోడలు బయట ప్రపంచంలోవి వీరికి కనపడేవి పక్షులు మాత్రమే..

రోజూ ఎగిరే జాతీయ జెండా కాస్త కొత్తగా కనిపిస్తుంది.

పళ్లెంలో ఒక లడ్డు పడ్డాక కానీ గుర్తు రాలేదు కొంతమందికి ఆ రోజు ఆగష్టు15 అని.

పొద్దుటెవరో జడ్జిగారు వచ్చారు, గాంధీ గారు చెప్పిన మంచి మాటలు కొన్ని చెప్పి, ఒక పావురాన్ని గాల్లోకి ఎగరేసారు.

ఆ ఎగిరిన పావురం కూడా బంధీ చేయబడే కదా మళ్లీ ఎగిరింది!

జైలు గోడల్ని తాకకుండా ఎంత వేగంతో వెళ్లి పోయిందో..

అది చేసిన తప్పు,ఒప్పు రెండూ లేవు.

తీసుకొచ్చారు,ఎగరేసారు!

దాన్ని చూసి కొంత మంది ఖైదీల నిర్వేదం ఇది.

తప్పు చేయకున్నా ఖైదులో ఉన్న వారు కొందరైతే, తప్పు చేసి కూడా స్వేచ్ఛగా బయట తిరిగే వారు కొందరు.

అయినా ఇప్పుడా పావురానికొచ్చింది స్వేచ్ఛ? మరొకడి చేతికి దొరికేవరకు జామీనా!!

ఆలోచిస్తూ అన్నాన్ని పక్కన పెట్టిన జీవా దూరం నుంచి విన్న పిలుపుతో ఈలోకానికి వచ్చాడు.

"జైలర్ గారు చెప్పండి" అంటూ పిలుపుకి స్పందించి వెళ్లాడు..

"ఇవ్వాళ్ల సాయంత్రం సాంస్కృతిక కార్యక్రమాలున్నాయి బయట నుంచి వచ్చే కళాకారుల చేత. ఎప్పటిలానే ఆ స్టేజీ డెకరేషన్ పనులు నువ్వే చూస్తున్నావ్ గా అయినా ప్రత్యేకంగా చెప్పాలా ఏమి?" అని మీసాలు సవరించుకుంటూ వెళ్లిపోయాడు.

పని చెయ్యడం, పుస్తకాలు చదవడం తోటి ఖైదీలకు కాస్త ఇళ్లకి ఉత్తరాలు రాయడంలో సాయపడటం ఇలాంటి సాయాల వల్లనేమో జైల్లో జీవా కి మంచి పేరుంది.

స్టేజి డెకరేషన్ పూర్తయ్యింది, దేశభక్తి నాటికలు, ప్రసంగాలు, సత్ప్రవర్తన సందేశాలు ఇలా ఎప్పటిలానే కాస్త విసుగ్గానే సాగుతోంది.

ఒక మంచి గొంతు, శ్రావ్యమైన రాగంతో లలిత గానం! స్టేజి వెనకున్న జీవా ఒక్కసారిగా ఉలిక్కిపడి, పరుగున వచ్చి స్టేజి ముందు కూర్చున్నాడు.

విన్నాడు!

ఏదో తెలియని బంధం సంగీతంతో తనకి,

కళ్లు కాస్త తేలికపడినట్లున్నాయ్ కన్నీరు బయటకొచ్చేయగానే!!

ఆ రోజు జీవా కి నైట్ డ్యూటీ జైల్లో

ఖైదీలున్న బ్యారక్ లో ఏ గొడవ జరక్కుండా!

ఇవ్వాళ్ల జీవా వంతు.

రాత్రి సుమారు 11 గం.ల సమయం.

అందరూ నిద్రపోతున్నారు.

చేతి వేళ్లతో ఊసలని నిమురుతూ ఏవో ఊసులు చెప్తున్నట్లు శబ్దం చేస్తున్నాడు.

● ● ●

చిన్నప్పుడే అనాధ జీవా!

మేనమామ దగ్గర ఆ పనులు ఈ పనులు చేస్తూ డిగ్రీ వరకు చదువుకున్నాడు.

మేనమామ కూడా కాలం చెయ్యడంతో మేనత్త వేధింపులు,ఛీత్కారాల్ని తట్టుకుంటూ ఊరిలో పిల్లలకి చదువు చెప్తూ, ఒక చిన్న మాస్టారిగా తయారవుతున్న రోజులవి. గుడిలోనే బడి.

అదే గుడిలో ఒక్కోసారి రాత్రి నిద్ర.

అప్పుడప్పుడూ దర్శనానికొచ్చే తన సీనియర్ లలిత దేవుడి ముందు చేసే గానానికి ముగ్ధులవ్వని వారెవరున్నారంటే లేరనే చెప్పాలి.

లలిత గుడికొచ్చిన ప్రతిసారీ ఆ అరగంట క్లాస్ కి సెలవు. పిల్లల ఆటపాట మధ్య కూడా అమ తమంటి గానానికి చెవులే కాదు మనసప్పగించి తన్మయత్వం పొందేవాడు. లలిత కూడా తను కనబడకుంటే పరిసరాలన్నీ కళ్ళతోనే గాలించేది.ఆ కళ్ళకు తన ఉనికి తెలియగానే ఒక మెరుపు కనిపించేది. తనకి లలితకు మధ్య ఉన్న అలౌకిక సంబంధాన్ని,

అనుబంధాన్ని తన కళ్లలో గమనించాడు జీవా.

బహూశా కనుల భాషంటే అదేనేమో..

ఆ భాషలో చెప్పలేనన్ని ఊసులు,కథలు.

అది ప్రేమేనని ఇద్దరికి తెలుసు.

ఒకరికొకరు చెప్పుకోలేదంతే.

కాస్త నల్లగా ఉన్నా కళ గలిగిన మోము లలిత ది.

పెళ్లి సంబంధాలు కూడా వచ్చిపోతున్నాయ్.

డబ్బు కూడా ఉండాలిగా మరి ఆ చిన్న వ్యవసాయ కుటుంబానికి .

జీవా ఇప్పుడు అనాధ కాదనే భావనలో ఆనందపడుతున్నాడు.

గానమాగింది ఒకరోజు మధ్యలో..

గుడి ధర్మకర్త వచ్చి అంచనాలు ఏవో వేస్తున్నాడు బిగ్గరగా.. గుడికి వేసే సున్నాల గురించి, పల్లకీకి చెద పట్టకుండా వేసే పేయింటింగ్ గురించని రంగుల రాజయ్య చెప్పాక తెల్సింది.

వెళ్తూ వెళ్తూ" ఏరా జీవా ఎలా ఉంది నీ బడి?

మీ మేనత్త గురించి కాస్త చెడ్డ మాటలు వింటున్నారా..

పిల్లలు లేరు, ఏం చేసుకుంటుందిరా ఆ ఆస్తి?"

"అయినా నువ్వేం చేస్తావులే, బొడ్రాయ్ పక్కనున్న నా పాత గేదెల దొడ్డిని శుభ్రం చేయించి పాక వేయిస్తా అందులో నడుపుకుందువు లేరా బడి.

దసరాకి చేయిస్తా దిగులు పడకు" అని చెప్పాడు ధర్మకర్త.

ఏదో కొత్త జీవితం కనిపించింది జీవాకి!

"సరే గుడికి రంగులేయిస్తున్నారా.. రాజయ్యకి కాస్త తోడుగా ఉండు.

ఎదో ఆడి పిల్ల పెళ్లంట,

అందుకే ఆడికీ కాంట్రాక్టు.

ఇంద ఉంచు" అని రాజయ్యకి ఒక వెయ్యి, జీవాకి ఒక 500 చేతిలో పెట్టి వెళ్లాడు ధర్మకర్త.

పెద్ద చెయ్యి మరి.

"ఊరి పెద్ద! మంచోడు. రావ్ గోపాల్రావ్ లా కనిపించినా ఎస్వీవోడి మనసు రా అబ్బాయా.. కొత్త బడి వస్తుంది అన్న మాట! శుభ్రంగా సేస్కో రా అయ్యా అంటూ.." రాజయ్య తన అన్న కూతురు లలితని తీస్కోని వెళ్లి పోయాడు.

రాజయ్య జీవా నాన్నకి అత్యంత స్నేహితుడు చిన్నప్పట్నించి తల్లోనాలుకగా ఉండే వాడు.

బాగా బతికి చెడ్డ కుటుంబం.

లలితకు బాబాయ్ కూడా.

పిల్ల పెళ్లి గవర్నమెంట్ ఆఫీసులో గుమస్తా తో వచ్చే నెల.

పెళ్లి ఖర్చులకి అప్పుకోసం తిరుగుతూ ఉన్నాడు స్థలానికున్న బి.ఫారం పట్టాతో!

● ● ●

గరగరగర మని శబ్దాలు

పొద్దుటే మొదలెట్టాడు రాజయ్య గుడిలో పెయింటింగ్ పని.

లలిత కూడా గానం మొదలెట్టింది.

బడికి 3 రోజులు సెలవని పంపించేసాడు పిల్లల్ని.

రాజయ్యకి సాయం చేస్తున్నాడు పొద్దుపోయిన దాకా!

రాత్రికి గుడిలోనే నిద్దరోతున్నాడు జీవా!

పొద్దుట చెప్పిన రాజయ్య మాటల్ని గుర్తుచేస్కుంటూ.

ఎల్లుండికి డబ్బివ్వాలని పెళ్లి వాళ్లకి.

స్థలం ఏమో ఏదో లిటిగేషన్లు గట్రా అని పని



కావట్లేదని!

మంచి నిద్రపట్టింది, లేచి చూసే సరికి గగ్గోలు గుడిలో, దేవుడి నగలు పోయాయని.

ధర్మకర్త, పోలీసోళ్లు, కుక్కలు అందరూ జీవా చుట్టూ ఉన్నారు.

● ● ●

అసలేం జరిగిందో తెలియకుండానే జీవా అరెస్టు.

ఏం జరుగుతుందో అర్థం కావట్లేదు.

మూడు రోజులు ఊర్లోని పోలీస్ స్టేషన్లోనే ఉంచి విచారిస్తున్నారు జీవాని!

సమాధానం ఒకటే నాకేం తెలియదని.

ఆ రోజే కోర్టుకి ప్రవేశ పెడతారు జీవాని. జీపు ఎక్కుతుండగా నిశ్చితార్థానికి రాజయ్య ఇంటికొచ్చారు పెళ్లి వాళ్లు.

పెళ్లి కూతుర్ని, రాజయ్యని చూసి జీపు ఎక్కాడు జీవా.

అర్థమయ్యింది జీవాకి!

ఏం జరిగిందో..

ఏమి తెలియనట్టు జీవాని చూసి చూడనట్టు పెళ్లి వాళ్లకి ఎదురేగి ఆహ్వానమిచ్చాడు రాజయ్య.

నిజం చెప్తే ఏం జరుగుద్దో మౌనంగా ఉన్న జీవాకి,

బోసి పోయి చూస్తున్న దేవుడికి మాత్రమే తెల్సు.

ఒంటి నిండుగా ఉన్న దెబ్బల్లోనే దేవుడి నగల దొంగతనపు నిందని మోస్తూ వెళ్తున్నాడు ఖైదుకి.

లలితకి ఎలా చెప్పాలి?

కంటికి కన్నీటికి ఉన్న దూరంలోనే లలితకు తెలియకుండా పయనిస్తున్నాడు.

జైల్లోకి!

● ● ●

తెల్లారిపోయింది

జైలు ఊసలతో ఈ జ్ఞాపకాల్ని పంచుకున్న జీవా కళ్లకిప్పుడు లలిత కావాలి!

ఆ నిజాన్ని చెప్పకపోయినా ఒక్క సారి తన చేతుల్లో వాలిపోవాలి.

"రేయ్ జీవా..

సత్ప్రవర్తన కల్గిన ఖైదీల్లో నీ పేరు వచ్చింది.

ఇవ్వాళే నువ్ రిలీజ్.

పద ఫార్మాలిటీస్ పూర్తి చేస్కో" అని జైలర్ వాయిస్.

తేరుకునేంతలోనే బయటకి 5 సంవత్సరాల తర్వాత!

బయటకొచ్చాడు, ఎక్కడికెళ్లాలి?

అనుకుంటూనే ఊరి పొలిమేరకొచ్చాడు.

పెళ్లి చేసిన కొన్నాళ్లకి మరణించిన రాజయ్య సమాధిపై తల వాల్చి చెప్పాడు.

"రాజయ్య విధి ఆటలో గెల్చింది ఎవరు? తప్పు చేసింది నువ్వు, నేను కాదు!

అని లేవబోతుండగా ఊరిలో వాళ్ల ఛీత్కారాలు ఎదురయ్యాయి.

రాళ్ల దెబ్బలు కొన్ని అందులో రక్త మోడుతున్న కాలితో గుడిలోకి వెళ్లి దేవుణ్ని చూసి నవ్వుకున్నాడు. పాతాలు చెప్పిన బండపై కూలబడి, ఈ లోకంలో లేనట్లుగా ఉన్నాయ్ ఆ కళ్లు.

● ● ●

గుడి మండపం మధ్యలో ఎవరో పాడుతున్నారు, అదే గొంతు వినపడింది జీవా కి.

చెవులు రిక్కించి గుడిలోకి వెళ్లబోతుండగా ఎవరో చెయ్యి పట్టుకొని లాగినట్లుగా అనిపించింది.

ధర్మకర్త..

గుడి వెనక్కి తీసుకెళ్లి రాజయ్య చనిపోయే ముందు 'జీవా నిర్దోషి అని, కూతురు పెళ్లి చేయడానికి తానే ఆ నగలు తీసానని, ఒక్కమారు జీవాకి క్షమాపణలు చెప్పాలనుందని' చెప్పిన నిజాన్ని తెలియపరిచాడు.

"నీ నైజం తెలిసినా ఊళ్ళోవాళ్ళతో కలిసి నేనూ నువ్వు దొంగవని నమ్మి కేసు పెట్టి జైలుకు పంపాను, చిన్నవాడివైనా నన్ను క్షమించు " అని కాళ్ల మీద పడేలోపు ధర్మకర్తని వారించాడు.

ఈ నిజం ఇంతటితోనే సమాధి కావాలన్న ఒట్టుని ధర్మకర్త నుంచి తీసుకొని,

"అయ్యా ఆకలి గా ఉంది.. ఏమైనా తినడానికి...." అనగానే లోపలికెళ్లి ప్రసాదం, మంచినీళ్ళు తీసుకొచ్చాడు.

గుండెలో గూడు కట్టిన భారం కాస్త తీరిందేమో ఆకలి తెలుస్తోంది. కొన్నేళ్ళక్రితం ఎన్నోసార్లు తన ఆకలికి భోజనంగా మారిన ఆ ప్రసాదాన్ని తృప్తిగా తిన్నాడు జీవా. "అయ్యా! ఇందాక గుడిలో వినిపించిన పాట పాడింది ...?" అంటూ అర్థోక్తిలో ఆగిపోయాడు. 'ఏమో ఊరి జనంతోపాటు లలిత కూడా నేను దొంగతనం చేసానని నమ్మిందేమో, ఒకవేళ అదే నిజమైతే ఆ ప్రశ్నార్థకపు చూపులని తాను తాళలేడనుకుంటూ' నిశ్శబ్దాన్ని ఆశ్రయించాడు.

ఆ సగంలో ఆగిన ప్రశ్నను వింటూనే ధర్మకర్త "లలిత గురించే కదా జీవా నీవడుగుతుంది. నిన్ను జైలుకి పంపినప్పుడు ఊరంతా నీవు దొంగవని నమ్మినా తను మాత్రమే నువ్వు అటువంటి వాడివి కాదని నమ్మింది. కాకపోతే ఆడపిల్ల కదూ నిన్ను ఎలా బయటకు తీసుకుని రాగలదు. ఎంతమంది పెళ్లి చేసుకోమని చెప్తున్నా నీ కోసమే ఎదురుచూస్తోంది" అని చెప్పి లోపలికి వెళ్ళి వెంటబెట్టుకొని వచ్చాడు

● ● ●

నిజం తెల్సిన లలితని.

అవును తన లలితని.

మౌనమొక్కటే లోకంలో ఉంది ఆ కాసేపు.

కన్నీటి విడుదల చప్పుడు ఎంత బిగ్గరగ ఉందంటే , ఒకరికొకరి మనసులు విడదీయలేనంతగా!

కళ్లు తుడుచుకున్న ధర్మకర్త ఒక్క ఉదుటున ఇద్దర్ని లాక్కొని జీపులోకి ఎక్కించుకొని ఊరికి దూరంగా ఉన్న బస్టాప్ లో దించి తనకు బడికై ఇస్తానన్న డబ్బు చేతిలో పెట్టి హాయిగా బ్రతకండని పంపించి వేసాడు.

● ● ●

వారిద్దరికి అప్పుడు కన్పించింది ఆ జామీను పావురం.

స్వేచ్ఛగా తన జతతో హాయిగా ఎగురుతూ.

గుండెలకు హత్తుకున్న తన జీవా తల నిమురుతూ లలిత!

లలిత ప్రేమలో సేద తీరుతున్న జీవా!!

● ● ●

కొన్నాళ్లకి కొత్త జైలర్ వచ్చాడు

జీవా,లలిత కాపురంలోకి

బుడ్డి జైలర్

వారిరువుర్ని ఒకే చోట ప్రేమతో కట్టిపడేసే

వాళ్ల కొడుకు 'సత్య' అని పేరుపెట్టుకున్న

జైలర్!!!!!!

✦

కథలకు ఆహ్వానం

ప్రజాశక్తి ఆదివారం అనుబంధం స్నేహ కథలకు ఆహ్వానం పలుకుతోంది. మంచి కథలను ఎంపిక చేసి ప్రచురిస్తాం. కథ సమకాలీన పరిణామాలు, పరిస్థితుల నేపథ్యంగా వుండాలి. ప్రపంచీకరణ నేపథ్యంలో వివిధ రంగాల్లో చోటు చేసుకున్న, చేసుకుంటున్న విపరిణామాలను కథాంశంగా తీసుకోవచ్చు. ప్రగతిశీల చైతన్యాన్ని, ఆత్మ విశ్వాసాన్ని పెంపొందించే కథలకు ప్రాధాన్యత. మూఢనమ్మకాలు పెంచేవిగా, ఏ సామాజిక తరగతిని ప్రత్యేకంగా నొప్పించేదిగా వుండకూడదు. మాండలికాలు ఉపయోగించినా కథన శైలి అందరికీ బోధ పడేలా వుండాలి. నవ్యత, వైవిధ్యం కలిగిన కథలకు ప్రత్యేక ఆహ్వానం.

నిబంధనలు

కథ నిడివి ప్రింటులో మూడు ఎ4 కాగితాల్లో వుండాలి. చేతిరాతలో అయితే 8 నుంచి 10 కాగితాల్లో వుండాలి. ప్రింటయినా, చేతిరాతైనా కాగితానికి ఒకవైపు మాత్రమే వుండేలా... జిరాక్స్ ప్రతిని పంపాలి. కథలను తిప్పి పంపడం వుండదు. పేరు, పూర్తి చిరునామా, ఫోన్ నెంబరు తప్పక రాయాలి. మా చిరునామా: స్నేహ, ప్రజాశక్తి దినపత్రిక, హౌస్ నెం. 27-30-4, ఆకుల వారి వీధి, గవర్నర్ పేట, విజయవాడ-2.

<u>మెయిల్ అడ్రస్:</u>

snehaweekly.praja@gmail.com

-ఎడిటర్

కళ్లు జాగ్రత్త



- గర్భం దాల్చాక రెండు వారాలకు బిడ్డ కళ్ల అభివృద్ధి చెందడం మొదలవుతాయి.
- కంటి వ్యవస్థలో 20 లక్షలకు పైగా విభిన్న భాగాలు పనిచేస్తాయి.
- కేవలం ఆరోవంతు కనుగుడ్డు భాగం మాత్రమే బయటకు కనిపిస్తుంది.
- కార్నియా మాత్రమే రక్తం ఉండని కణజాలం.

- కంటిని మొత్తాన్ని ట్రాన్స్‌ప్లాంట్ చేయలేం. ఎందుకంటే దాదాపు 10 లక్షల నెర్వ్ ఫైబర్లు కంటికి మెదడుకు అనుసంధానమై ఉంటాయి.



- మనిషి కన్ను డిజిటల్ కెమెరా అయితే దాని సామర్థ్యం 576 మెగా పిక్సెల్స్‌గా చెప్పవచ్చు.
- ఐన్‌స్టీన్ కళ్లను న్యూయార్క్ నగరంలోని ఓ సేఫ్ బాక్స్‌లో భద్రపరిచారు.
- నీలి కళ్లు కలిగిన వారంతా కూడా పదివేల ఏళ్ల క్రితం నల్ల సముద్రం ప్రాంతంలో నివసించిన ఓ వ్యక్తి వారసులే.



- మనం ఏం చూస్తామో దాని మీద ఆధారపడే 80 శాతం జ్ఞాపకాలుంటాయి.
- 80 శాతం కంటి సమస్యలు నివారించదగినవి.
- వేలి ముద్ర మీద 40 ప్రత్యేక లక్షణాలుంటే, ఐరిస్‌లో 256 ప్రత్యేకతలుంటాయి. అందుకే బొటన వేలి ముద్ర కన్నా రెటీనా స్కాన్‌లనే భద్రతా అవసరాలకు వాడుతున్నారు.

- రెటీనా వెనుక ఉండే కొరాయిడ్ మీద కెమెరా ఫ్లాష్ పడి 'రెడ్ ఐ' చిత్రాలు వస్తాయి. కారణం, ఆ భాగంలో రక్త వాహకాలు ఎక్కువగా ఉండి ఎరుపును ఫిల్మ్ మీద కనిపించేలా చేస్తాయి.

- కంటి ద్వారానే 80 శాతం విషయాల్ని మనం నేర్చుకుంటాం.
- మెదడు తర్వాత అత్యంత సంక్లిష్ట అవయవం కన్ను.

- రెటీనా చిత్రాన్ని తల కిందులుగా చూస్తే మెదడు దాన్ని సరిచేసి చూస్తుంది. అలాగే రెండు కళ్లు పంపే రెండు భాగాలుగా ఉన్న రెండు చిత్రాల్ని ఒక్కటిగా చేసి చూస్తుంది మెదడు.
- 20/20 విజన్ అంటే 20 అడుగుల ముందున్న వస్తువుల్ని స్పష్టంగా చూడగలగడం అన్నమాట. ఇది సాధారణ కను దృష్టి.
- కళ్లంటే భయముంటే దానిని వొమ్మాటోఫోబియా అంటారు.
- గాఢాంధకారంలో మన కళ్లు చూసే రంగు ఐగెన్‌గ్రా (బ్రెయిన్ గ్రే).
- నైట్ విజన్ కళ్లజోడులో పచ్చటి కాంతిని వినియోగించడానికి కారణం మన కళ్లు అన్ని వర్ణాల కంటే పచ్చదనంలోని వైవిధ్యాల్ని తేలిగ్గా గుర్తుపడుతుంది.



- ఓ వస్తువును అలానే చూస్తుంటే కాసేపటికి అది కనిపించదు. దీన్ని ట్రాక్స్‌లెర్ ఫినామినన్ అంటారు. అందుకే కళ్లు మైక్రోసాక్కేడ్స్ అనే చిన్న చిన్న జెర్క్‌లు ఇస్తూ దృష్టిని సరిచేసుకుంటుంది.
- కంటి ఫోకస్‌ను సరిచేసే కండరం రోజుకు పది లక్షల సార్లు కదులుతుంది.
- మనుషలందరిలో కేవలం 2 శాతం మందికే పచ్చ రంగు కళ్లుంటాయి. ఇదే అత్యంత అరుదైన నయన వర్ణం.

- గాఢాంధకారంలో 48 కి.మీ. ఆవల ఉన్న కొవ్వొత్తి వెలుగుల్ని కను చూపు గుర్తించగలదు.
- ప్రతి 12 మంది పురుషుల్లో ఒకరికి కలర్ బ్లైండ్ సమస్య ఉంటుంది.

- ఒక్కో కంటిలో పది కోట్ల 70 లక్షల కణాలుంటాయి.
- మొత్తం జీవిత కాలంలో కళ్లు రెండు కోట్ల 40 లక్షల చిత్రాల్ని చూస్తాయట.
- మానవుని కన్ను కోటి రకాల వైవిధ్యమైన రంగుల్ని గుర్తించగలదు.
- కొందరు మహిళలు మిగతావారి కంటే కొన్ని లక్షల వైవిధ్యమైన రంగుల్ని చూడగలరు.

కొత్త పుస్తకాలు

అక్షరాలే ఆయుధాలైన చోట

రచన: ఆకు కదలని చోట
రచయిత: బాల సుధాకర్ మౌళి
వెల: 116/-
పేజీలు: 135
ప్రతులకు: సిక్కోలు బుక్‌ట్రస్ట్, ఎపిహెచ్‌బి కాలనీ, శ్రీకాకుళం-532001

ఇప్పుడు ప్రపంచమే ఒక యుద్ధ భూమి. ఎప్పుడూ ఎక్కడో చోట యుద్ధనాదాలు వినిపిస్తూనే ఉంటాయి. ఒక బలవంతమైన దేశం మరొక బలహీనమైన దేశాన్ని కబళించాలని చూస్తుంది. కానీ ఇప్పుడు ఏ చిన్న రాజ్యం కూడా చేతులు ముడుచుకుని కూర్చోవడంలేదు. తనపై దాడి చేసిన అగ్ర రాజ్యాన్నైనా ప్రతిఘటిస్తుంది. ఇరుపక్షాలు ఇలా మోహరించిన చోట కవిపీడితుల పట్ల తన ధిక్కార స్వరాన్ని వినిపిస్తాడు. అలాంటి కవే శ్రీబాల సుధాకరమౌళి. ఆయన రచించిన కవితా సంపుటి 'ఆకు కదలని చోట' యుద్ధమనే ఆంబోతుకు ప్రజలు ఇప్పుడు ముకుతాడు వేస్తున్నారు. యుద్ధం వచ్చినప్పుడు చేతులు ముడుచుకొని కూర్చోకుండా ఎదుర్కొంటున్నారు. 'సిరియా' రెండు కన్నీటి బొట్లనే దేశంలో' పదం చుట్టూ నిఘా అల్లుకుంటున్నపుడు పదం పేలవుతుంది. జనం చుట్టూ యుద్ధం రంకె వేస్తున్నపుడు జనం పులుతుంది అని యుద్ధ బాధితుల ఆగ్రహాన్ని అక్షరీకరిస్తారు. యుద్ధం కేవలం రెండు దేశాల మధ్యే కాదు ప్రజలకీ ప్రభుత్వానికీ మధ్య కూడా జరుగుతుంది. ఇప్పుడు అరకులోయలో బాక్సైటు కోసం కొండల్ని తవ్వుతున్నారు. ఇలా తవ్వడం వలన తమకు చాలా నష్టాలు కలుగుతాయని గిరిజనులంతా ఈ చర్యను వ్యతిరేకిస్తున్నారు. 'కొండమేకా' కవితలో 'కాళ్ళ కింద నేలని కళ్ళ ముందే కుళ్ళబొడుస్తుంటే భయంభయంతో పరుగులీస్తుంది' అంటూ ఆ భయపడిన మేకో కోపమొస్తే ఎదురుతిరుగుతుంది అని "ఒక్క సారి ఆగ్రహిస్తే నేల కేసి కుమ్ముతుంది' అని అంటారు. మేక సాధు జంతువు. ఆదివాసీలు కూడా ఎవరి జోలికి వెళ్ళకుండా తమ బతుకేదో తాము బతుకుతుంటారు. ఐనా తమ సంపదను దోచుకుంటే ఎందుకు ఎదిరించరు. ఇక్కడ కవి కొండమేకను ఆదివాసీలు ప్రతీకగా అభివర్ణిస్తారు. 'గాయం గానం', 'బస్తర్' వీరికి సంబంధించిన కవితలే.

ఇటీవల రచయితలపై దాడులు జరుగుతున్నాయి. తమిళ రచయిత పెరుమాళ్ మురుగన్ మూఢ విశ్వాసాలకు వ్యతిరేకంగా నవల రాసినపుడు నిషేధించాడు. రచయితల స్వేచ్ఛను హరించడం అమానుషం. దీన్ని ఖండిస్తూ 'నిషేధం గురించే మాట్లాడు' లో మట్టి మీద పోరాడే అతి సాధారణ మనిషైనా నిషేధంగురించే మాట్లాడాలి' అని అంటారు. వేళ్ళ గురించి కూడా కన్నడ రచయిత హుచంగి ప్రసాద్‌పై దాడికి నిరసనగా రచించిన కవిత 'నలుపురంగు' ఇలాంటి కవితే. ఇలా రచయితలపై నిషేధాన్ని విధిస్తున్న రాజ్యం నిరంకుశత్వాన్ని క్రూరత్వాన్ని ఖండిస్తూ 'శిక్షణ' అనే కవితలో 'అక్షరాన్ని గ్రెనేడ్‌లా మార్చి శత్రువు మీదికి సూటిగా విసరడానికే శిక్షణ తీసుకుంటున్నాను' అని తన స్వేచ్ఛా స్వరాన్ని వినిపిస్తారు. కవి ఉపాధ్యాయుడు. తరగతి గదిని విలక్షణంగా వర్ణిస్తారు. తరగతి గది మూగ జంతువులా వుంటే ఏం బాగోదు. 'సకల ఆయుధాలతో సిద్ధమయి' యుద్ధరంగంలో వున్న వీరునిలా వుండాలి అంటారు. తరగతిలో చెప్పేది మామూలు పాఠాలు కావు. రాజ్యం రాక్షసత్వం గురించో ధీరుని వాడని స్వప్నం గురించో చూచాయిగానైనా చెబుతుంది. పాఠం బతుకుతుంది అని ఒక వీరుని కలగురించో ప్రభుత్వం రాక్షసత్వం గురించో చెప్పించినప్పుడు మాత్రమే పాఠం బతుకు తుందని నిర్వచనమిస్తారు. శరణార్థి అంతరంగంలో యుద్ధం ఆగిపోతే ప్రశాంతమైన పరిస్థితి పునరుద్ధరింపబడుతుంది. మళ్ళీ నిత్య జీవితం మామూలుగా వుంటుందని ఆశిస్తాడు. 'యుద్ధం ఆగినట్టుంది బాంబుల శబ్దాలు వినిపించట్లేదు నిర్భయంగానే వీధుల్లోకెళ్ళి ఆహారపదార్థాలు కొనుక్కురావచ్చు అని యుద్ధంలేని ప్రపంచం కోసం అందమైన కల కంటారు.

మనం ప్రతి రోజూ టీ యో, కాఫీయో తాగుతాం. అది మామూలు పనే. మామూలు విషయాన్ని కవిత్వీకరించడం కవి ప్రతిభకు తార్కాణం. అలాంటి కవిత కప్పు టీ. 'కావడానికి కప్పు టీయే ...కప్పు టీకి ఒక సమూహాన్ని కలిపే గుణముంది. యుద్ధం సన్నిహితుల మధ్య కనిపించకుండా మొలిచే మనస్పర్థలనూ సంకోచాలనూ చెదరగొట్టి ఒక రోజులోంచి మరో రోజులోకి చేయి పట్టుకుని నడిపించే గొప్ప సాన్నిహిత్య స్పర్శేదో వుంది' అని అంటారు. ఒకానొక కనిపించని స్నేహపరిమళమేదో ఇద్దరి మధ్య అల్లుకోవడం గురించి పందిరిమీద విరజాజి పువ్వులు విచ్చుకొన్నట్లు అందంగా ఆత్మీయంగా చెప్తారు. కవి స్నేహశీలి. తనకు నచ్చిన, తనను ప్రభావితం చేసిన పలువురు వ్యక్తుల గురించి 'నిర్బంధపు గోడల్ని...అతనింకా జ్వాల, నేలపాటగాడు, వాక్యం వుంది, అతను అనేక రంగులు' మొదలైన కవితల్లో తన విద్యార్థులపై అభిమానాన్ని ప్రదర్శించారు. మానవ జీవితాన్ని అతలా కుతలం చేస్తున్న యుద్ధ బీభత్సాన్ని గురించి, మేధావులపై జరుగుతున్న దాడుల గురించి , రాజ్య హింస గురించి సూటిగా చెప్పిన కవితలివి. శత్రువుగుండెల్లో గురిచూసి గుచ్చిన అక్షరాల ఆయుధాలివి. ప్రజల ఓట్లతో అధికారంలోకి వచ్చిన ప్రభుత్వ పాలనలో ప్రజాభిప్రాయం పరిగణలోకి తీసుకోకుండా ఏక పక్ష నిర్ణయాలు తీసుకొంటున్న పుడు ఆలోచనా పరుడైన కవికి ప్రజలను చైతన్య పరచే బాధ్యత వుంది. ఆ బాధ్యతను నిర్వహించిన మౌళి గారికి అభినందనలు.

- మందరపు హైమవతి



రచన: 'సామా' రేడియో నాటకం
రచయిత: ఎస్.డి.వి. అజీజ్
వెల: 50/-
పేజీలు: 67
ప్రతులకు: విశాలాంధ్ర, ప్రజాశక్తి, నవోదయ బుక్ సెంటర్ విశాలాంధ్ర (కర్నూలు), మరియు ప్రముఖ పుస్తక విక్రయ కేంద్రాలు

పుస్తకాలు



రచన: నవభారతం
రచయిత-సేకర్త: తిప్పినేని రామదాసప్ప నాయుడు
వెల: 100/-
పేజీలు: 96
ప్రతులకు: ఎడిటర్, డే బై డే న్యూస్ వాచ్, బర్కత్‌పుర, హైదరాబాద్ 500027.
సెల్ : 9989818212

మలై లడ్డు

కావాల్సిన పదార్థాలు

మైదాపిండి–1/2 కెజి
నెయ్యి–400 గ్రాములు
పంచదార పొడి– 1కెజి
జీడిపప్పు–1/4 కెజి
హార్లిక్స్–200 గ్రాములు
జాజికాయ, జాపత్రి–5 గ్రాములు
యాలకుల పొడి–10 గ్రాములు
కిస్‌మిస్–50 గ్రాములు
పిస్తాపప్పు–100 గ్రాములు
బాదంపప్పు–100 గ్రాములు



తయారుచేసే విధానం

ముందుగా స్టౌపై పాన్ ఉంచి నెయ్యి వేసి వేడెక్కిన తర్వాత అందులో మైదాపిండి వేసి సన్నటి మంటపై వేయించుకోవాలి. మైదా వేగిందో లేదో తెలుసుకునేందుకు ఒక నీటి చుక్కని వేగుతున్న మైదా మిశ్రమంపై వేయాలి. అది పొంగితే మైదా పిండి వేగిందని అర్థం. ఒక గిన్నెలోకి వేయించిన మైదా మిశ్రమాన్ని తీసుకుని చల్లార్చుకోవాలి. పూర్తిగా చల్లారాక అందులో హార్లిక్స్, పంచదార పొడి వేసి బాగా కలపాలి. ఈ మిశ్రమం బాగా మెత్తగా ఉంటే మరింత పంచదార వేసి కలుపుకోవాలి. ఇప్పుడు పిస్తా పప్పు, బాదం పప్పు చిన్న చిన్న ముక్కలుగా కోసి నేతిలో వేయించుకోవాలి. అందులో కిస్‌మిస్, యాలకుల పొడి, జాజికాయ, జాపత్రి కూడా చేర్చి నెమ్మదిగా కలపాలి. ముందుగా తయారుచేసిపెట్టుకున్న లడ్డూ మిశ్రమాన్ని కూడా ఇందులో వేసి బాగా కలుపుకోవాలి. ఈ మిశ్రమం పూర్తిగా చల్లారిన తర్వాత అరచేతికి నెయ్యి లేదా నూనె రాసుకుని లడ్డూ మిశ్రమాన్ని కొద్ది కొద్దిగా తీసుకుని నచ్చిన సైజులో ఉండలుగా చుట్టుకోవాలి. ఇప్పుడు సర్వింగ్ బౌల్స్‌లో మలై లడ్డూలని ఉంచి అతిథులకందించండి.





కాజు కట్లీ

కావాల్సిన పదార్థాలు

జీడిపప్పులు–2 కప్పులు
పంచదార–1 కప్పు
నెయ్యి–1 కప్పు
యాలకుల పొడి–1/2 టీ స్పూన్
సిల్వర్ పేపర్–1

తయారుచేసే విధానం

ముందుగా జీడిపప్పును మూడుగంటల పాటు నానబెట్టుకోవాలి. నీరు వంపేసి జీడిపప్పులని మెత్తని పేస్ట్‌లా చేసి పక్కనపెట్టుకోవాలి. నాన్‌స్టిక్ పాన్‌లో పంచదార, ఒక కప్పు నీరు పోసి సన్నని మంటపై ఉడికించాలి. తర్వాత జీడిపప్పు ముద్దను వేసి బాగా కలుపుతూ సన్నని సెగపై ఉడికిచుకోవాలి. ఈ మిశ్రమం గట్టిపడుతుండగా నెయ్యి, యాలకులపొడి వేసి బాగా కలిపి స్టౌ కట్టేయాలి. ఒక ప్లేట్‌కు నెయ్యిరాసి ఈ మిశ్రమాన్ని వేసి సమానంగా పరచాలి. దీనిపై సిల్వర్ పేపర్ వేసి డైమండ్ లేదా చతురస్రఆకారంలో కట్‌చేసుకోవాలి.

బేసిన్ బర్ఫీ

కావాల్సిన పదార్థాలు

శనగపిండి–4 కప్పులు
నెయ్యి–2 కప్పులు
పంచదార పొడి–2 కప్పులు
బాదం పప్పులు–10
పిస్తా పప్పులు–12
యాలకుల పొడి–1 టేబుల్ స్పూన్

తయారుచేసే విధానం

డీప్ బాటమ్ ప్యాన్ తీసుకుని అందులో కొద్దిగా నెయ్యివేసి స్టౌపై పెట్టాలి. నెయ్యి కరిగిన తర్వాత అందులో శెనగపిండి వేసి బాగా మిక్స్ చేసుకోవాలి. బంగారు రంగు వచ్చేవరకు సన్నని మంటపై వేయిస్తూ మధ్య మధ్యలో బాగా కలియబెట్టాలి. ఇలా చేయడం వల్ల అడుగంటిపోకుండా ఉంటుంది. ఈ మిశ్రమం బాగా వేగిన తర్వాత అందులో యాలకుల పొడి వేసి కలుపుకోవాలి. అందులో పిస్తా , బాదం పప్పులు కూడా వేసి కలుపుకోవాలి. ఐదునిమిషాల తర్వాత ప్యాన్‌లో నుండి ఈ మిశ్రమాన్ని ఒక బౌల్‌లోకి తీసుకుని కొద్దిగా చల్లారిన తర్వాత పంచదార పొడి వేసి ఉండలు లేకుండా బాగా కలుపుకుని పక్కన పెట్టుకోవాలి. ఇప్పుడు ఒక ప్లేట్‌కి నెయ్యి రాసి బేసిన్ మిశ్రమాన్ని అందులోకి మార్చుకోవాలి. బాదం పప్పులతో గార్నిష్ చేసి రెండు, మూడు గంటలు అలాగే పక్కన పెట్టుకోవాలి. తర్వాత మీకు నచ్చిన ఆకారంలో ముక్కలుగా కట్‌చేసుకుంటే బేసిన్ బర్ఫీ రెడీ. కోవా మిల్క్ మెయిడ్‌ని ఉపయోగించి కూడా బేసిన్ బర్ఫీని తయారు చేసుకోవచ్చు.



బాల నేస్తాలు

పదాలు గుర్తించండి

ఇక్కడ పేరొందిన కొన్ని క్రీడల బొమ్మలని ఇచ్చాం. కింద ఇచ్చిన ఖాళీల్లో వాటి పేర్లను రాసి పైనున్న అక్షరాల పట్టికలో ఆ పేర్లు ఎక్కుడున్నాయో గుర్తించండి.

b________

t_____ t_____

t________

C G Z
V Z V O B O B
S Y R R O L T W J D H
Y V R V M L F A M Z Y H X
N U F M E X L K B V B T T A Q
Q W I V R X E W L Q A T X P L
O M M F X X A Y U E Y D N K O V E
P G K O I W S B D T W M W P S W C
C X H J R U J O A T E H I L L R T A K
S C M Y A Z N H L B N S N A C R E A G
A V K Q W X L K L M N H T J N R N W O
O C J V E F R W G I Q O Z V S N B
B A S E B A L L C S K N H H B I O
A Q H V G K W T B Y L F A B S
A M E X B A S K E T B A L L O
Y O H E K N P M E K M C F
F O O T B A L L N P O
D O C H C L M
W J E

f________

b________

v________

b________

g________

జ: Basketball, Table tennis, Tennis, baseball, football, golf, volleyball, Cricket



ఏమిటది?

పొడవుగా వుండే పంటను పొడిగా వాడతాం. ఏమిటది?

[illegible]



కనిపెట్టండి

అగ్గిపుల్లలతో చేసిన రెండు చతురస్రాల్ని ఇక్కడ ఉంచాం. వీటిలో నాలుగు అగ్గిపుల్లల్ని కదిలిస్తే మూడు చతురస్రాలు ఏర్పడతాయి. అదెలాగో కనిపెట్టండి.

జవాబు

లిటిల్ స్టార్

హాయ్ ఫ్రెండ్స్ నేనొక టాలీవుడ్ స్టార్‌ని! ఇది నా చిన్ననాటి ఫోటో ఇంతకీ నేనెవరో చెప్పండి?

జ: ప్రణీత

తేడాలు గుర్తించండి

ఈ రెండు బొమ్మల్లో ఏడు తేడాలు ఉన్నాయి. వాటిని గుర్తించి సున్నా చుట్టేయండి.





బొమ్మలు పూరించండి

పిల్లలూ! మీకు బొమ్మలు గీయడమంటే ఎంతో ఇష్టం కదూ! మీ కోసం ఆర్టిస్ట్ అంకుల్ ముందుగా కివీ బొమ్మని సగం గీసి ఉంచాడు. మీరు మిగిలిన భాగాన్ని జాగ్రత్తగా పూర్తిచేయండే!

నీడ గుర్తించండి

ఇక్కడ ఒక గుర్రం బొమ్మనుంచాం. అయితే దాని ఎదురుగా ఉన్న నీడల్లో గుర్రం అసలైన నీడ ఎక్కడ వుందో కనిపెట్టి సున్నా చుట్టేయండి.



పేపర్ మాస్క్



పిల్లలూ! మీరు బజారులో దొరికే రకరకాల మాస్క్‌లని ధరించి అప్పుడప్పుడూ మీ చిట్టి చెల్లెళ్ళు, తమ్ముళ్లని ఆటపట్టిస్తుంటారు కదా.... అయితే వాటిని బయట కొనకుండా మీరే సొంతగా తయారు చేసుకోవచ్చు. ఎలా చేయాలో మేం నేర్పిస్తాం. జాగ్రత్తగా మీరూ తయారుచేయండి.

కావాల్సిన వస్తువులు

క్షన్‌స్ట్రక్షన్ పేపర్-1(తెలుపు రంగులో), పోస్టర్ పెయింట్ / క్రేయాన్స్- నచ్చిన రంగులు, కత్తెర, గమ్, ఈకలు-3, పెయింట్ బ్రష్, రంగు పూసలు, కుందన్స్, స్టోన్స్, చెమ్కీలు, పేపర్ రిబ్బన్ రీల్-1 నచ్చిన రంగుల్లో, సిల్వర్ రీల్ (అల్యూమినియమ్ రీల్)

తయారుచేసే విధానం

కన్‌స్ట్రక్షన్ పేపర్ తీసుకుని దానిపై పెన్సిల్‌తో బొమ్మలో చూపిన విధంగా నచ్చిన మాస్క్ ఆకారాన్ని గీసుకోవాలి. కత్తెరతో జాగ్రత్తగా మాస్క్‌ని కత్తిరించి మీ కళ్ల భాగానికి సరిగ్గా అమరేలా సరిచూసుకోవాలి. ఇప్పుడు ఈ మాస్క్‌ని సిల్వర్ పేపర్‌పై ఉంచి పెన్‌తో మాస్క్ చివర్లను, కళ్ల భాగాన్ని మార్క్ చేసుకుని జాగ్రత్తగా కత్తి రించి పక్కన పెట్టు కోవాలి. మాస్క్ మరింత అందంగా ఉండేందు కు రెండు మూడు పేపర్ మాస్క్ ఆకారాలని కలిపి అతికించుకోవచ్చు. ఇప్పుడు పెయింట్ బ్రష్ తీసుకుని కట్‌చేసి పెట్టకున్న పేపర్ మాస్క్‌లపై నచ్చిన రంగు పెయింట్‌లని వేసుకోవాలి. పెయింట్ పూర్తిగా ఆరిన తర్వాత మాస్క్‌లని ఒక దానిపై మరొకటి ఉంచి బొమ్మలో చూపిన విధంగా అతికించుకోవాలి. కళ్లభాగం చివర్లలో పెయింట్‌తో అందంగా డిజైన్లని గీసి మరికొంతసేపు ఆరనివ్వాలి. ఇప్పుడు మీరు గీసిన డిజైన్ అంచుల వద్ద స్టోన్స్, కుందన్‌లని అంటించుకోవాలి. వీటిని గ్లిటర్ గమ్‌తో కూడా అంటించుకోవచ్చు.



ఇప్పుడు నచ్చిన రంగులో మూడు ఈకలని తీసుకుని మాస్క్ మధ్యలో (వెనుక భాగంలో) గమ్‌తో అతికించాలి. కట్‌చేసి పెట్టుకున్న సిల్వర్ పేపర్‌ని మాస్క్ వెనుక భాగంలో అతికించుకోవాలి. అర గంట తర్వాత మాస్క్ చివర్లలో రంధ్రాన్ని చేసి ఎలాస్టిక్‌ని దూర్చి రెండు వైపులా ముడి వేయాలి. ఇప్పుడు మీరు తయారు చేసిన మాస్క్ వేసుకుని మీ చిట్టి తమ్ముళ్లు, చెల్లెళ్లకి సర్‌ప్రైజ్ ఇవ్వండి.

అడ్డం ఆధారాలు

1. ఒక పచ్చడి(3)
3. ప్రాణులు (3)
7. చలి (2)
8. నవ్వేటట్లు చేయడం (3)
9. ఏడున్నర గడియల కాలం (2)
13. సరుకులు దించినందుకు ఇచ్చేకూలి (4)
14. మండలాధిపతి (4)
16. మోసం (2)
17. శరీరము (3)
18. చోటు (2)
21. పొట్టివాడు (3)
22. పక్షంలో తొమ్మిదో తిథి(3)

పదవినోదం - 37

కూర్పు: రావెళ్ల

✿	1	2		✿	3	4		✿
5	✿		✿	6	✿		✿	✿
7		✿	8			✿	9	10
	✿	11	✿		✿	12	✿	
13				✿	14			
	✿		✿	15	✿		✿	
16		✿	17			✿	18	
✿	✿	19	✿		✿	20	✿	
✿	21			✿	22			✿

నిలువు

2. వాయువు (2)
4. తలకిందులైన మరణం (2)
5. దీవించుట(6)
6. రెచ్చగొట్టు (3)
10. కవిత్రయం(6)
11. దారులు కలిసే చోటు తారుమారు (3)
12. కుందేలుతో పందెం వేసి గెలిచినది (3)
15. తెలుగు సంవత్సరాలలో 55వ సంవత్సరం పేరు(3)
19. సన్న చెక్క (2)
20. పడవ (2)

సుడోకు

8	9	2			3		1	4
				6	8		7	
4	5			8				1
		8				2		
1		3	7			5		
	7	1			6		5	
5		9	2				8	
6					7			9

గతవారం జవాబులు

3	2	8	5	4	9	1	6	7
4	7	5	3	1	6	2	8	9
6	9	1	2	7	8	3	4	5
7	1	6	8	9	2	4	5	3
2	3	9	6	5	4	7	1	8
5	8	4	7	3	1	9	2	6
8	4	2	9	6	3	5	7	1
9	6	7	1	2	5	8	3	4
1	5	3	4	8	7	6	9	2

1 అం	ద	2 రు	✿	3 క	ల్పా	4 వృ	క్ష	5 ము
గా	✿	జం	✿	ని	✿	శ్రీ	✿	ఖం
6 లా	భ	✿	7 పొ	గ	ల	✿	8 రా	గ
భా	✿	9 జ	✿	రి	✿	10 వం	✿	✿
11 తం	పా	ల	జ	✿	12 న	డి	వ	13 జే
✿	✿	ము	✿	14 అం	✿	రి	✿	వ
15 క	రి	✿	16 వ	ద	ని	✿	17 పి	రా
ల	✿	18 సం	✿	సై	✿	19 హా	✿	శు
20 శం	ఖ	స్తా	వ	న	✿	21 న	గ	ఱ

సుమం ప్రతి సుమం సుమం..









సైకిళ్ల మీద పూలు, పళ్లూ అమ్మేయాలనిపిస్తుంది లోయ్స్ హీరింక్ కళ్లతో చూస్తే. కింది నుంచి దాటెళ్లే పూలమ్మిని నడక వంతెనల మీది నుంచి చూస్తే మీ మనసుకు మీరే పుష్ప గుచ్ఛాలు ఇచ్చుకుంటారు. అంతందంగా విరబూస్తాయి ఆమె సుమ చిత్రాలు. నెదర్‌ల్యాండ్స్‌కు చెందిన ఈ కమ్యూనికేషన్ ఆఫీసర్‌కు ఫొటోగ్రఫీ అంటే ప్రాణం. ఓ సారి వియత్నాంలోని హనోయిలో కొన్నేళ్లు ఉండే అవకాశం వచ్చింది. ఆ వూళ్లో పూలు, పళ్లు, కూరగాయలను సైకిళ్లపై వీధుల వెంట తిరుగుతూ అమ్మడం ఆమెకు గమ్మత్తుగా అనిపించింది. వారిని ఫాలో అవుతూ వారి జీవన చిత్రాన్ని ఒడిసిపట్టాలని కెమెరా వెంటేసుకు తిరిగింది. అలా ఓ బ్రిడ్జిపై నుంచి పరిశీలిస్తుండగా ఇలా ఫొటోల్లో బంధించాలని ఐడియా తట్టింది. పై నుంచి చూస్తే మొత్తం సర్దుబాటు అంతా పుష్ప గుచ్ఛం అలంకరణలా ఆమెకు తోచింది. అంతే సుమం ప్రతి సుమం సుమం..ను కలిపి కెమెరాలో చూసింది. పూలమ్మిల కష్టాన్ని కూడా చూసింది. ఉదయాన్నే 4 గంటల కల్లా లేచి తాజా పూలు, పళ్లను రకరకాలుగా అందంగా అలంకరించుకుని బయలుదేరుతారట. ఏ రోజు కూడా ఒకే విధానంలో అలంకరణ ఉండదట. వలస పక్షులుగా హనోయిలో వాలిపోయిన మహిళల్లో ఎక్కువమంది ఇలా పూల బుట్టల్ని పట్టుకుంటారట. కొన్ని రోజుల పాటు సరైన షాట్ కోసం ఎదురు చూసి మరీ ఈ చిత్రాల్ని తీసింది లోయ్స్. కొన్ని సార్లైతే 5 గంటలు నిరీక్షించిన ఫలితం ఉండేది కాదట. 'వెండార్స్' పేరిట 100 చిత్రాలతో కూడిన అద్భుతమైన ఫొటోబుక్‌ను రూపొందించాలనేది లోయ్స్ కల.



పిల్లర్స్ ఆఫ్ క్రియేషన్ నెబ్యులా

దివి దివ్వెల జన్మస్థలం

ఆకాశ దీపాలు పుట్టేదిక్కడే. వెలుగుల మూలాలు దొరికేదిక్కడే. అవే నెబ్యులాలు. నక్షత్ర జన్మస్థానాలు, సౌర వ్యవస్థల జనన కేంద్రాలు. కాంతుల పండుగలకు కారణాలివే. ఓ చుక్క పొడిచినా, రాలినా అది విశ్వ ధూళిలోంచే, విశ్వ వాయువులోకే. దట్టమైన విశ్వ మేఘాల్లో ఓ తార వెలుస్తుంది. ఏ ఘట్టం జరిగినా అది నెబ్యులాతో పరిణామం చెందుతుంది. ఆ తారలతోటే గ్రహాలు ఇతర శకలాలు విస్తరిస్తాయి. వాటితోటే ఓ సౌర వ్యవస్థ తయారవుతుంది. హైడ్రోజన్, హీలియంతో పాటు మిగతా అయనీకరణ చెందిన వాయువులు, అణువులతో కూడిన భారీ ధూళి మేఘాలే నెబ్యులాలు. నక్షత్రాలు పుట్టుక కారణమయ్యేవి ఉంటాయి. నక్షత్రం చనిన తర్వాత ప్లానెటరీ నెబ్యులాలుగా మారేవి ఉంటాయి. వీటి పరిమాణం ఊహాకందదు. కొన్నయితే కొన్ని లక్షల కాంతి సంవత్సరాల వ్యాసంతో ఉంటాయి. ఒకప్పుడు మన పాలపుంత అవల ఉన్న గెలాక్సీలను కూడా నెబ్యులాలుగా పిలిచేవారు. కానీ ఆ తర్వాత స్పష్టత వచ్చింది. నెబ్యులాల్లో మరో విస్మయకరమైన అంశమేమంటే కొన్ని నెబ్యులాల సాంద్రత భూమి అంత పరిమాణంలోఉన్నా అవి కొన్ని కిలోల బరువే తూగుతాయి. కానీ తీవ్ర సాంద్రత ఉన్న చోట్ల నక్షత్రాలు పుట్టుకొస్తాయి. (ఈ చిత్రాలను హబుల్, స్పిట్జర్ తదితర టెలిస్కోప్‌ల ద్వారా వివిధ కెమెరాలను ఉపయోగించి తీసినవి. ఈ కాంతుల వర్ణాలను అక్కడ ఉన్న ధాతువుల ఆధారంగా ఇస్తారు.)

క్రాబ్ నెబ్యులా

సోల్ ప్లస్ నెబ్యులా

స్పైడర్ నెబ్యులా

కెరీనా నెబ్యులా

రోసెట్టె నెబ్యులా

క్యాట్ పా నెబ్యులా

కరోనా ఆస్ట్రేలియాస్ నెబ్యులా



హార్స్ హెడ్ నెబ్యులా

Check List

Book Number	KNSR02BILe3	**Date**	03/09/22
Front Cover	yes	**Back Cover**	yes
Blank Pages	No		
Missing Pages	No		
Prepared By	Mouni	**Cutting By**	Mouni
Scanned By	Shameera	**Pages**	29